విజయ్‌వి పగటి కలలు

● ఈపీఎస్ విమర్శ

ప్యారీస్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో అంతగా అనుభవంలేని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, నటుడు విజయ్ ఉన్నపళంగా అధికారంలోకి రావాలని పగటి కలలు కంటున్నారని, ప్రజల అండదండలు లేకుండా ఇది ఎప్పటికీ నెరవేరదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించారు. డీఎంకే అవినీతిని ఎండగట్టడానికే అన్నాడీఎంకేను ఎంజీఆర్ స్థాపించి ప్రజా సమస్యలపై దాదాపు ఐదేళ్ల పోరాడి అధికారంలో కూర్చున్నారని గతాన్ని గుర్తుచేసుకున్నారు. రాష్ట్రంలో కొత్తగా పార్టీలు ప్రారంభించే నాయకులంతా ఎంజీఆర్, జయలలితల ఫొటోలతో ప్రజలను ఆకట్టుకుంటున్నారని, విజయ్ కూడా టీవీకే మహానాడులో అన్నాదురై, ఎంజీఆర్ ఫొటోలు పెట్టారని వ్యాఖ్యానించారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో ఈపీఎస్ సాగిస్తున్న ప్రచారయాత్ర గురువారం ఉదయం కాంచీపురం చేరుకుంది. ఆయన ముందుగా కామాక్షి అమ్మవారిని దర్శించి విశేష పూజలు చేశారు. అనంతరం కాంచీపురం జంక్షన్‌లో సాయంత్రం జరిగిన రెడ్‌షోలో ఈపీఎస్ మాట్లాడుతూ రాజకీయ పార్టీని ప్రారంభించిన వెంటనే అధికారంలోకి వచ్చిన చరిత్ర ఇప్పటివరకు ఎవరికీ లేదని, ప్రజల కోసం విరామం లేకుండా శ్రమించిన పార్టీలకే తగిన గుర్తింపు ఉంటుందన్నారు. అలా కాకుండా పార్టీ ప్రారంభించిన సంవత్సరానికే అధికార పీఠమెక్కాలని నటుడు విజయ్ కంటున్న పగటి కలలు నెరవేరబోవని ఆయన విమర్శించారు. చేనేత రంగాన్ని కాపాడి నేత కార్మికుల జీవనశైలిని మెరుగుపరిచేందుకు అన్నాడీఎంకే ప్రభుత్వం అమలుపరిచిన పథకాలను, చేసిన కృషిని వస్త్ర పరిశ్రమలకు పేరెన్నికగన్న కాంచీపురం ప్రజలు మరిచిపోలేదన్నారు. అదేవిధంగా గత అసెంబ్లీ ఎన్నికల డీఎంకే మేనిఫెస్టోలో 525 ప్రకటనలను ఆ పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ విడుదల చేసి ప్రజలను నమ్మించి, అధికారపీఠమెక్కారని, అయితే ఆ హామీల్లో 10 శాతం కూడా అమలుపరచకుండా రాష్ట్రప్రజానీకాన్ని మోసం చేశారని మండిపడ్డారు. కొత్తగా రాజకీయ పార్టీని ప్రారంభించిన నటుడు విజయ్ తాను పాల్గొనే సభల్లో అన్నాడీఎంకేను స్థాపించిన దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ పేరు ఉచ్చరిస్తున్నారని, అంతటితో ఆగకుండా మదురై టీవీకే మహానాడులో అన్నాదురై, ఎంజీఆర్ ఫొటోలను ఏర్పాటు చేయడం ఎందుకో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.


రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

7910 ఎకరాల ఆలయ భూములు స్వాధీనం

మంత్రి పీకే శేఖర్‌బాబు

వేడుకగా ఏకాంబరేశ్వరాలయ కుంభాభిషేకం


కుంభాభిషేకంలో పాల్గొన్న మంత్రి శేఖర్ బాబు


హాజరైన అశేష భక్తజనం

అడయార్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్యాక్రాంతమైన రూ.7822 కోట్ల విలువైన 7910 ఎకరాల దేవాలయ భూములను స్వాధీనం చేసుకున్నట్టు రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు వెల్లడించారు. పార్క్‌టౌన్‌లో ఉన్న కామాక్షి సమేత ఏకాంబరేశ్వరాలయం కుంభాభిషేక వేడుకలు గురువారం జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రి శేఖర్ బాబుతో పాటు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శేఖర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ. ఆక్రమణలకు గురైన ఆలయ భూములను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.6,980 కోట్ల విలువ చేసే 27563 ఆలయాలకు కుంభాభిషేకాలు జరుగుతున్నాయన్నారు. దాతలు కూడా రూ.1,67 కోట్ల మేర అలయ జీర్ణోద్ధారణ పనులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర నిపుణుల కమిటీ 13,931 ఆలయాల జీర్ణోద్ధారణ పనులకు అనుమతిచ్చారని గుర్తు చేశారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమానికి అండగా ఉంటున్న ముఖ్యమంత్రిస్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ఇతర శాఖలకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కాంచీపురం ఏకాంబరనాద ఆలయ కుంభాభిషేకానికి అవసరమైన జీర్ణోద్ధరణ పనులు ముగిశాయని, రాజగోపురం పనులు మిగిలివున్నాయన్నారు. ఈ నెల 30వ తేదీ ఆయా శాఖల ఉన్నతాధికారులతో వెళ్లి పరిశీలిస్తానని మంత్రి వెల్లడించారు. గురువారం జరిగిన ఏకాంబరేశ్వరాలయ కుంభాభిషేకం వేడుకల్లో దేవాదాయ శాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్, డిప్యూటీ కమిషనర్ ఆర్.హరిహరన్, ఆలయ ట్రస్టీ అశోక్ కుమార్, ట్రస్టీలు వెంకటేశన్, నీలేంద్ర కుమార్, శశికళ, ముత్తుకుమార్, కార్యనిర్వహణాధికారి ముత్తుస్వామి తదితరులు పాల్గొన్నారు.

సబర్బన్ ప్రాంతాలకూ

అల్పాహార పథకం

● 26న ప్రారంభించనున్న సీఎం స్టాలిన్

● 3.05 లక్షలమంది బడిపిల్లలకు లబ్ధి

చెన్నై, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని సబర్బన్ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలకు విస్తరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు ఈ పథకం విస్తరణ ద్వారా 3.05 లక్షలమందికి ఉదయం పూట అల్పాహారం అందిస్తారు. దీనిని ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ నెల 26న ప్రారంభించనున్నారు. బడిపిల్లలకు ఉచిత అల్పాహార పథకాన్ని 2022 సెప్టెంబర్ 15న మదురై ఆదిమూలం కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో సీఎం ప్రారంభించారు. ఈ పథకానికి నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రుల నుండి మంచి స్పందన లభించింది. దీంతో 2023 ఆగస్టు 25న కరుణానిధి జన్మస్థలం తిరుక్కువళైలోని ప్రాథమిక పాఠశాలలో ఈ పథకం విస్తరణకు శ్రీకారం చుట్టారు. గత ఏడాది జూలై 15న తిరువళ్లూరు జిల్లాలో మరో 3995 ప్రభుత్వ ఎయిడ్ పాఠశాలకు ఈ పథకాన్ని విస్తరించారు. ఈ పథకం కారణంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గత మూడేళ్లుగా పెరిగిందని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. కాగా ఈ నెల 26న మైలాపూరులోని సెయింట్ జోసెఫ్ ప్రాథమిక పాఠశాలలో ముఖ్యమంత్రి స్టాలిన్ అల్పాహార పథకం విస్తరణకు శ్రీకారం చుడతారని తెలిపారు.

'కలైంజర్' పథకానికి 15 లక్షల దరఖాస్తులు...

రాష్ట్ర వ్యాప్తంగా ఉంగలుడన్ స్టాలిన్ పేరుతో ప్రజా వినతుల స్వీకరణ శిబిరాలలో గృహిణులకు చెల్లించే కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకం కోసం సుమారు 15 లక్షల మంది దరఖాస్తు పెట్టుకున్నారు. వాటిని త్వరగా పరిష్కరించి అర్హులైన వారందరికీ ఆ పథకాన్ని అమలు చేయాలని సీఎం ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో రెండు నెలల్లోగా ఈ దరఖాస్తుదారులకు పథకాన్ని అమలు చేయడానికి సంబంధిత అధికారులు తగు సన్నాహాలు చేపడుతున్నారు.


అల్పాహార పథకం ప్రారంభోత్సవంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న సీఎం (ఫైల్ ఫొటో)

మహానాడుకు తరలివచ్చిన జనసందోహం - వేదికపై ప్రసంగిస్తున్న విజయ్



ఎన్నికల్లో ఒంటరి పోరాటమే
తేల్చి చెప్పిన టీవీకే అధినేత విజయ్

డీఎంకేతోనే ఢీ

● బీజేపీతో పొత్తుకు మేం అవినీతిపరులం కాదు ● అన్నాడీఎంకేపై పరోక్ష విమర్శలు

చెన్నై, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో ఫాసిస్టు బీజేపీని, పాయిజన్ డీఎంకేని చిత్తుగా ఓడించడమే తమిళగ వెట్రికళగం (టీవీకే) ప్రధాన కర్తవ్యమని ఆ పార్టీ అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ శపథం చేశారు. మదురై సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన పార్టీ ద్వితీయ మహానాడులో ఆయన ఉద్వేగంగా ప్రసంగిస్తూ.. తమ పార్టీకి సైద్ధాంతిక శత్రువు బీజేపీ అని, రాజకీయ శత్రువు డీఎంకే అని ప్రకటించారు. అదే సమయంలో అన్నాడీఎంకే పేరు ప్రస్తావించకుండా ఆ పార్టీపై పరోక్ష విమర్శలు చేశారు. అడవిలోని సింహం ఒంటరిగానే వేటకు వెళ్తుందని, తనకంటే బలమైన ఎరను మాత్రమే వేటాడుతుందని, ఆ రీతిలోనే తాను రాజకీయాల్లో తాడోపేడో తేల్చుకోవాలనే డీఎంకేతో తలపడేందుకు సిద్ధమయ్యాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే ఒంటరిగా బరిలోకి దిగుతుందని స్పష్టం చేశారు. సినీ రంగంలో ఛాన్సులు లేక తాను రాజకీయాల్లోకి రాలేదని, ఆ రంగంలో ఉన్నతస్థితిలో ఉన్నప్పుడే రాజకీయ ప్రవేశం చేశానని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో 234 నియోజకవర్గాలలోనూ తానే అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు భావించి ప్రజలంతా పార్టీకి ఘనవిజయం చేకూర్చాలని పిలుపునిచ్చారు.

బీజేపీతో పొత్తు మాకు అనవసరం...

రాష్ట్రంలో తాము చేసిన అవినీతి అక్రమాలకు భయపడుతూ ఓ పార్టీ బీజేపీతో ప్రత్యక్షంగా పొత్తుపెట్టుకుందని, మరొక పార్టీ రహస్యంగా పొత్తు కుదుర్చుకుందని విజయ్ ఆరోపించారు. ఆ రెండు పార్టీల బాటలో టీవీకే కూడా బీజేపీతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ పట్టలేదని, ఆ పార్టీతో పొత్తు పెట్టుకునేందుకు తామెలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదన్నారు. మదురై నగరంలో పార్టీ ద్వితీయ మహానాడు ఇంత గొప్పగా జరుగటం తనకెంతో ఆనందం కలిగిస్తోందని, మదురై ప్రజలు నిజాయితీ పరులను ఆదరిస్తారని, అందుకు మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ చక్కటి ఉదాహరణ అని, ఆయనను చూడలేకపోయినా ఆయన గుణాలను పుణికి పుచ్చుకున్న విజయకాంత్‌తో మంచి పరిచయాలున్నాయని, ఆ నాయకుడిని స్ఫూర్తిగా తీసుకునే నిజాయితీతో రాజకీయాలు చేస్తున్నానని వెల్లడించారు. విక్రవాండిలో తమ పార్టీ తొలి మహానాడు రాష్ట్ర రాజకీయాలను వేడెక్కించిందని, ఆ రీతిలోనే మదురై మహానాడు ప్రత్యర్థుల గుండెల్లో గుబులు పుట్టిస్తోందని అన్నారు. పార్టీని ప్రారంభించినప్పటి నుండి ప్రత్యర్థులంతా పనిగట్టుకుని విమర్శలు చేస్తున్నారన్నారు. రాజకీయాల్లోకి ఆయనే (రజినికాంత్) రాలేదు ఈయన వస్తారా? అని ఎగతాళి చేశారని, రాజకీయాల్లోకి వచ్చాక అధికారంలోకి రాలేరని నిరుత్సాహపరుస్తున్నారని, ఏది ఏమైనప్పటికీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ డీఎంకేతోనే తలపడుతుందని, ఈ రెండు పార్టీ మధ్యే గట్టి పోటీ ఉంటుందన్నారు. ఎంజీఆర్ స్థాపించిన పార్టీలో కార్యకర్తలంతా అయోమయంలో ఉన్నారని, ఆ పార్టీని సక్రమమైన మార్గంలో నడిపించేవారు లేకపోవటం శోచనీయమన్నారు. తనను సినిమా మనిషి అని విమర్శలు చేస్తున్నారని, వాస్తవానికి సినిమావాళ్లంతా మూర్ఖులు కారని చెబుతూ రాజకీయవాదులంతా మేధావులు కారని, అంబేడ్కర్‌ను, నల్లకన్నును, కామరాజర్‌ను ఓడించింది రాజకీయ నేతలే తప్ప సినీ నటులు కాదని ఆయన చెప్పారు.

వెరీ వెరీ వరెస్ట్ అంకుల్...

ఈ సభలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌ను విజయ్ పదే పదే 'స్టాలిన్ అంకుల్' అని సంబోధిస్తూ ఆయనపై విమర్శల వర్షం కురిపించారు. "డీఎంకే పాలనలో న్యాయం ఉందా? ప్రజలకు భద్రత ఉందా? మహిళలకు రక్షణ ఉందా? సహజవనరులకు భద్రత ఉందా? చెప్పండి స్టాలిన్ అంకుల్" అంటూ ప్రశ్నించారు. "టాస్మాక్‌లో రూ.1000 కోట్లకు పైగా అవినీతి జరిగాయంటున్నారు. మహిళలకు వెయ్యి రూపాయలు ఇస్తే చాలా అంకుల్? తమకు భద్రతే లేదని మహిళలు చెబుతున్న మాటలు మీకు వినపడవా అంకుల్? ఇది చాలక మహిళలంతా మిమ్మల్ని డాడీ అని పిలవాలని చెబుతున్నారే.. వాట్ ఈజ్ దిస్ అంకుల్, దిస్ ఈజ్ వెరీ వెరీ రాంగ్ అంకుల్. మహిళలకే కాదు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు, రైతులకు, మత్స్యకారులకు కూడా మాయమాటలతో మోసగిస్తున్నారే.. వెరీ వెరీ వరెస్ట్ అంకుల్" అంటూ ధ్వజమెత్తారు. విజయ్ తొలిసారిగా పార్టీ ద్వితీయ మహానాడులోనే స్టాలిన్, మోదీ పేర్లను పదే పదే ప్రస్తావిస్తూ వారిని తీవ్రంగా విమర్శించారు. ప్రధాని మోదీని పూర్తి పేరుతో సంబోధించి 2029 వరకూ సొగసుగా, విలాసంగా గడపాలని అనుకుంటున్నారా? తమిళనాట మీ పప్పులేం ఉడకవు. బీజేపీ నుంచి ఒక ఎంపీని కూడా గెలిపించలేదనే అక్కసుతో రాష్ట్రంపై కక్షగడతారా? అని ప్రశ్నించారు.

సోదరుడిగా భావించే మగువల పిల్లలకు నేనే మేనమామ...

విజయ్ తన ప్రసంగంలో స్టెరిలైట్ కర్మాగారానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పోలీసుల కాల్పుల్లో మృతి చెందిన 'స్నోలిన్' పేరు ప్రస్తావిస్తూ ఆమె తల్లిని ఓదార్చేందుకు వెళ్లినప్పుడు మృతి చెందిన యువతికి తానే మేనమామ అని చెబుతూ విలపించారని, ఆ సోదరి పిల్లలకే కాదు తనను అన్నగా, తమ్ముడిగా భావించే వారి పిల్లలందరికీ తాను మేనమామగా ఉంటానని చెప్పారు. ఈ సభలో విజయ్ ఓ పిట్ట కథను కూడా చెప్పారు. 'ఓ రాజు సైన్యాధ్యక్షుడిని ఎంపిక చేయడానికి పదిమందిని పిలిచి ఉడికించిన వరివిత్తనాలను ఇచ్చి పంట పండించమని పురమాయించాడు. వారిలో తొమ్మిదిమంది పంట ఏపుగా పెరిగిందంటూ వరికంకులను రాజుకు ఇచ్చారు. చివరగా వచ్చిన వ్యక్తి రాజు ఇచ్చిన విత్తనాలు ఉడికించినవిగా గుర్తించానని, వాటిని పండించడం సాధ్యం కాదని చెప్పాడు. వెంటనే రాజు అతడి నిజాయితీని మెచ్చుకుని సైన్యాధ్యక్షుడిగా నియమించాడు. తొమ్మిదిమంది అసత్యమాడారు. పదో వ్యక్తి సత్యం పలికి దళపతి అయ్యాడు. ఈ సభకు హాజరైన లక్షలాదిమంది జనం కూడా మంచి దళపతిగా నన్నే ఎంచుకుంటారని భావిస్తున్నా' అని వ్యాఖ్యానించారు. సభ నాలుగు గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా మహానాడుకు సుమారు 2.5 లక్షల మంది రావడంతో వారంతా స్వస్థలాలకు తిరిగి వెళ్లేటప్పుడు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్న ఉద్దేశంతో గంట ముందుగానే ప్రారంభించారు.


చెన్నై కలైంజర్ అరంగంలో మాజీ మంత్రి దివంగత రహ్మాన్‌ఖాన్ 'ఇడిముయక్కమ్' పేరుతో రచించిన గ్రంథావిష్కరణ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ఖాదర్ మొయిుద్దీన్ తదితరులు

ముగిసిన కౌన్సెలింగ్

● 1.45 లక్షల ఇంజనీరింగ్ సీట్ల భర్తీ

● మిగిలిపోయినవి 41,746

● ఈ ఏడాది కూడా కంప్యూటర్ సైన్స్‌కే డిమాండ్

చెన్నై, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని 423 ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్లకు సంబంధించిన జూలై 7న ప్రారంభమైన కౌన్సెలింగ్ రెండు విడతలుగా ముగిసింది. దీని ద్వారా 92,424 సీట్లు భర్తీ అయ్యాయి. ఆ తర్వాత మూడో విడత కౌన్సెలింగ్ ఈ నెల 7న ప్రారంభమై బుధవారంతో ముగిసింది. జనరల్ కేటగిరీలో 50,093 సీట్లు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్లస్‌టు దాకా చదివిన విద్యార్థులకు 7.5 శాతం రిజర్వేషన్ల ప్రకారం 2075 సీట్లు సహా మొత్తం 52,168 సీట్లు భర్తీ అయ్యాయి. జూలై 7 నుండి ఈ నెల 20 దాకా జరిగిన అన్ని విడతల కౌన్సెలింగ్‌లో మొత్తం 1.45,481 సీట్లు భర్తీ అయినట్లు రాష్ట్ర ఇంజనీరింగ్ అడ్మిషన్ల కమిటీ అధికారులు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల్లో మొత్తం 1,87,227 ఇంజనీరింగ్ సీట్లుండగా వాటిలో 1,45,481 సీట్లు భర్తీ అయ్యాయి. 41,746 సీట్లు భర్తీ కావాల్సి ఉంది. ఈ యేడాది యాభైవేలకు పైగా సీట్లు ఖాళీగా ఉంటాయని విద్యావేత్తలు అంచనా వేశారు. చివరకు వారి అంచనాల కంటే తక్కువగానే సీట్లు మిగిలాయి. ప్రస్తుతం 39 కళాశాలల్లో మొత్తం సీట్లు భర్తీ అయ్యాయి. 118 కళాశాలల్లో 95 శాతం, 205 కళాశాలల్లో 80 శాతం కంటే అధికంగా సీట్లు భర్తీ అయ్యాయి. కోర్సులవారీగా సీట్ల భర్తీని పరిశీలించినప్పుడు కంప్యూటర్ సైన్స్ కోర్సులోనే అధికంగా 27,926 మంది అడ్మిషన్లు పొందారు. ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్‌లో 18,762 మంది, ఐటీ కోర్సులో 14,025 మంది, ఏఐ, డేటా సైన్స్ కోర్సులో 17,240 మంది, మెకానికల్ కోర్సులో 9274 మంది, సివిల్‌లో 4609 మంది అడ్మిషన్లు పొందారు.

నేడు నెల్లైకు అమిత్ షా



అడయార్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం తిరునెల్వేలి రానున్నారు. నెల్లై కేంద్రంగా జరుగనున్న బీజేపీ బూత్ కమిటీ సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఆయన హెలికాప్టర్ ల్యాండ్ అయ్యేందుకు పాళయంకోటలోని జాన్స్ కాలేజీలో ప్రత్యేకంగా హెలిప్యాడ్ నిర్మించారు. హోం మంత్రి పర్యటన సందర్భంగా నెల్లై జిల్లా వ్యాప్తంగా గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. రాష్ట్రంలో వచ్చే యేడాది శాసన సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో పార్టీ శ్రేణులను అప్రమత్తం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితరులు వరుసగా పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో నెల్లైలో జరుగనున్న బీజేపీ బూత్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు హోం మంత్రి అమిత్ షా ఢిల్లీ నుంచి కొచ్చి చేరుకుని, అక్కడ నుంచి ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ప్రత్యేక విమానంలో తూత్తుకుడి చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో నెల్లైకు చేరుకుంటారు. ఆ తర్వాత నెల్లై తచ్చనల్లూరు బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన బూత్ కమిటీ సమావేశ మందిరానికి చేరుకుంటారు. సాయంత్రం ఈ కార్యక్రమాన్ని ముగించుకుని తిరిగి ఢిల్లీ వెళ్తారు.

సమాచార దృశ్యిని

అగ్నిమాపక శాఖలో ఉద్యోగాల జాతర

● 3,644 పోస్టుల భర్తీకి చర్యలు
● నేటినుంచి దరఖాస్తుల ఆహ్వానం

అడయార్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అగ్నిమాపక శాఖలో వేలం సంఖ్యలోని ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఈ శాఖతో పాటు పోలీస్ కానిస్టేబుల్, యూనిఫార్మ్ సర్వీస్ కానిస్టేబుల్‌తో కలిపి మొత్తం 3644 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందుకోసం గురువారం నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించారు. తమిళనాడు యూనిఫార్మ్‌డ్ సర్వీస్ సెక్షన్ బోర్డు ఆధ్వర్యంలో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. దీని కోసం రాత పరీక్ష నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ యేడాది ఖాళీ పోస్టులను వెల్లడించి భర్తీ చేయనుంది. 2833 సెకండరీ గ్రేడ్ కానిస్టేబుల్ పోస్టులు, 180 జైలు సిబ్బంది, 631 అగ్నిమాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టులకు ఈ నెల 22 నుంచి సెప్టెంబరు 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. సెప్టెంబరు 25న దరఖాస్తుల్లో తప్పొప్పుల సవరణకు అనుమతిస్తారు. నవంబరు 11న రాత పరీక్ష జరుగనుంది. పూర్తి వివరాలను 'డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.టీఎన్‌యూఎస్‌ఆర్‌బీ.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. కానిస్టేబుల్ పోస్టుకు రూ.18,200 నుంచి రూ.67,100 వేతనం ఇస్తారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జూలై ఒకటో తేదీ నాటికి 18 యేళ్ళు పూర్తయి, 26 యేళ్ళకు మించరాదని ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

మాధ్యమిక పాఠశాలల స్థాయి పెంపు

ప్యారీస్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యాసంవత్సరం నుంచి 11 పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. వాటి వివరాలు... అరియలూరు జిల్లా కరయవేట్టి మాధ్యమిక, ఈరోడ్ జిల్లాప్లె మేట్టునాసువంపాళయం మాధ్యమిక, సిరుకళంజి మాధ్యమిక, కడలూరు జిల్లా నత్తం మాధ్యమిక, చెంగల్పట్టు జిల్లా ఒట్టెబాక్కం మాధ్యమిక పాఠశాలలను అప్‌గ్రేడ్ చేశారు

డీఎంకే నేతలతో స్టాలిన్ సమావేశం

అడయార్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలపై డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ గురువారం సమావేశమయ్యారు. 'ఉడన్ పిరప్పే వా' అనే పేరుతో సీఎం స్టాలిన్ నియోజక వర్గాల వారీగా పార్టీ నేతలతో సమావేశమవుతున్న విషయం తెల్సిందే. ఇందులోభాగంగా ఆయన రాయపురం, షోళింగనల్లూరు నియోజకవర్గాల పార్టీ నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఎయిర్‌పోర్టు నుంచి సిరుచ్చేరికి ఎలక్ట్రిక్ బస్సులు

ప్యారీస్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక త్రిశూలం విమానాశ్రయం నుంచి సిరుచ్చేరి వరకు ఏసీ ఎలక్ట్రిక్ బస్సు సేవలను బుధవారం ప్రారంభించినట్లు ఎంటీసీ తెలిపింది. ఎయిర్‌పోర్టు ప్రాంగణం నుండి ఏప్రిల్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం కిలాంబాక్కం బస్‌టెర్మినల్, ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో ఉన్న అక్కరై మార్గాల్లో రెండు ఏసీ బస్సులను ఎంటీసీ నడుపుతోంది. ఈ బస్సులకు విశేష స్పందన వచ్చిన నేపథ్యంలో విమానాశ్రయం నుండి చెంగల్పట్టు జిల్లా సిరుచ్చేరి సిప్కాట్ వరకు కొత్తగా డిజైన్ చేసి ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. విమానాశ్రయం నుండి బయలుదేరే ఈ బస్సులు పల్లావరం మీదుగా కీల్‌కట్టలై జంక్షన్, పల్లికరణై జంక్షన్, షోలింగనల్లూరు, తురైపాక్కం, పాతమహాబలిపురం రోడ్డు మీదుగా సిరుచ్చేరికి చేరుకుంటున్నాయి.

రహదారుల మరమ్మతులకు రూ.200 కోట్లు

ప్యారీస్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో రూ.200 కోట్లతో రహదారుల మరమ్మతులు చేపట్టనున్నట్లు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్)ప్రకటించింది. రెండో విడత మెట్రో రైలు పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను సీఎంఆర్‌ఎల్ ఇంజనీర్ల బృందం పరిశీలించింది. షోలింగనల్లూరు-సిరుచ్చేరి, సెయింట్ థామస్ మౌంట్-పూందమల్లి, అవడి రోడ్డు, కోడంబాక్కం ఆర్కాడువీధి, వానువంపేట, మేడవాక్కం తదితర ప్రాంతాల్లోని రోడ్ల మరమ్మతులకు రాష్ట్ర రహదారులశాఖకు రూ.200 కోట్లు విడుదల చేసినట్లు సీఎంఆర్‌ఎల్ అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

రెడ్‌హిల్స్: పుదునగర్ 3 నుండి 5వీధులు, నరవారికుప్పం వీధి, దర్గాస్ రోడ్డు, జేజేనగర్, తీర్థంకరైపట్టు, బాలవినాయక నగర్, వివేకప్పర్ అవెన్యూ, పాడియనల్లూరు, కన్నపాళయం, సెంధిరంబాక్కం, సీరంగయూర్, పెరుంగావలూరు, గుమ్మనూర్, ఆర్‌జేఎన్ కాలనీ, గోమతియమ్మన్‌నగర్, మనీష్‌నగర్, జయదుర్గానగర్, విష్ణునగర్, మహారాజనగర్, కరికాల నగర్.

మాంగాడు: టౌన్ పంచాయతీ, రఘునాథన్‌పురం, కొలుమానిక్కవాక్కం, సిక్కరాయపురం, పట్టూరు, పత్రిమేడు, సౌత్‌కాలనీ, శ్రీనివాసనగర్, మలయంబాక్కం, మహాలక్ష్మీనగర్, చక్రనగర్, కామాక్షినగర్, సాదిక్‌నగర్, నెలితోపు, మేల్మానగర్, శక్తినగర్, కేకేనగర్. **ఐటీ కారిడార్:** పిల్లయార్‌కోవిల్‌వీధి, ఎస్‌బీఐ కాలనీ, గంగయమ్మన్ ఆలయ వీధి, 200 అడుగు రేడియల్ రోడ్డు, పోస్టాఫీస్ వీధి, ఎంసీఎన్‌నగర్, ఎంసీఎన్‌నగర్ ఎక్స్‌టెన్షన్, శ్రీపురంరోడ్డు. **తరమణి:** కదన్‌చావడి, కల్లుకుట్టై, తిరువళ్లువర్‌నగర్, గాంధీనగర్, నెహ్రూవీధి, రాజాజీవీధి, వాల్మీకివీధి, ముల్లైవీధి, కామరాజర్‌వీధి, కమ్మర్‌వీధి, మథర్‌థెరిస్సావీధి, రాజీవ్‌వీధి, ఇందిరాగాంధీ వీధి, అన్నావీధి, కన్నదాసన్‌వీధి, చిదంబరనాథ్‌వీధి, ఝాన్సీరాణి వీధి, అంబేడ్కర్‌వీధి, వ్యాసర్‌వీధి, కొడికాత్తకొమ్మన్‌వీధి, కట్టబొమ్మన్ వీధి, సుభాష్‌చంద్రబోస్‌వీధి, చేరన్‌వీధి, కరికాలన్‌వీధి. **అడయార్:** శాస్త్రినగర్ 1వ అవెన్యూ, 1వ వీధి, 2వ వీధి, 15వ క్రాస్ వీధి.

తిరువాన్మియూర్: ఎల్బీరోడ్డు, కామరాజర్‌నగర్, అప్పాసామి ప్రైమ్‌టవర్స్, ఇందిరానగర్, టీఎన్‌హెచ్‌పీ కాలనీ, మాలవ్య అవెన్యూ, మరుదీశ్వరర్‌నగర్, ఎంజీ రోడ్డు. **షోళయూర్:** మాడంబాక్కం మెయిన్‌రోడ్డు, హంసాగార్డెన్, జైన్ అపార్ట్‌మెంట్, బ్యాంకుకాలనీ, భువనేశ్వరినగర్ ,తిరువళ్లువర్ వీధి, గాంధీవీధి, శ్రీరామ్‌నగర్, సుదర్శన్‌నగర్, రాజాజీనగర్.

పెరంగలత్తూరు: భారతినగర్ 1 నుండి 8 వీధులు, గాంధీనగర్, సారంగఅవెన్యూ, సెఠగోపన్‌నగర్, గుడ్‌విల్ నగర్. **సెంబాక్కం:** శరవణనగర్, వీజీపీ శ్రీనివాసనగర్, సత్యసాయి నగర్, కౌశిక్ అవెన్యూ, శాస్త్రినగర్.

కాసా గ్రాండ్ ఉద్యోగుల విహార యాత్ర





యాత్రకు జెండా ఊపుతున్న అరుణ్ - సంతోషంగా రైలెక్కిన ఉద్యోగులు

చెన్నై, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్లలో ఒక్కటైన 'కాసా గ్రాండ్' తమ ఉద్యోగులకు అనిర్వచనీయమైన, అసాధారణ అనుభవాన్ని అందించింది. తమ సంస్థకు చెందిన 800 మంది ఉద్యోగులను ప్రత్యేక రైలులో గోవా యాత్రకు తీసుకెళ్లింది. గురువారం సాయంత్రం తాంబరంలో బయలుదేరిన ఈ రైలుకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ ఎంఎస్ జెండా వూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ అభివృద్ధి వెనుక తమ ఉద్యోగుల కృషి వుందన్నారు. వారిని తమ కుటుంబీకులుగా భావిస్తామని, అందుకే ప్రత్యేక రైలు అద్దెకు తీసుకుని యాత్రకు తీసుకెళ్తున్నామని తెలిపారు.

నారాయణ విద్యా సంస్థ ఆధ్వర్యంలో 'సఫలత కా రాస్తా'



అడయార్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆసియాలోనే అతిపెద్ద విద్యా సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందిన నారాయణ విద్యా సంస్థ 'సఫలత కా రాస్తా - రోడ్ టు సక్సెస్' ఐదో సీజన్ ప్రారంభించింది. తేనాంపేటలోని కామరాజర్ అరంగంలో తాజాగా జరిగిన ఈ సీజన్‌ను నారాయణ గ్రూపు విద్యా సంస్థల డైరెక్టర్ శరణి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ సఫలతా కా రాస్తా అంటే విజయానికి మార్గదర్శి అని, ఈ కార్యక్రమం నారాయణ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించడం జరిగిందన్నారు. ఈ తరహా కార్యక్రమాలను వివిధ రాష్ట్రాల్లో నిర్వహిస్తూ ఇప్పటివరకు 15 వేల మంది విద్యార్థులకు చేరువైయినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని చెన్నైలో నిర్వహించడం ఇదే తొలిసారన్నారు. జెన్ జడ్ వెనకటి తరాల కంటే చాలా భిన్నంగా వేగవంతంగా ఉంటుందని సాంకేతికతకు అధిక ప్రాధాన్యత ఇచ్చేలా వేగంగా మారుతున్న ప్రపంచానికి, సామాజిక అవగాహనను అర్థం చేసుకుంటారని ఆమె పేర్కొన్నారు.

రూ.31.88 లక్షల మోసం

● మహిళ అరెస్టు

అడయార్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ సీటు పేరిట రూ.31.88 లక్షల మేరకు మోసం చేసిన ఓ మహిళను కన్నియాకుమారి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ జిల్లాకు చెందిన రోస్‌మేరీ (45) అనే మహిళ గత యేడాది ఆగస్టు 28న చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఓ ఫిర్యాదు చేసింది. అందులో.. తన కుమార్తెకు 2022లో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని చెప్పి రమ్య (50) అనే మహిళ రూ.50 లక్షలు ఖర్చు అవుతుందని నమ్మించిందని, తొలి విడతగా రూ.31.88 లక్షలను తేనాంపేటలోని డీఎంఎస్ ప్రాంగణంలో తీసుకున్నట్టు ఆ ఫిర్యాదులో పేర్కొంది. ఆ తర్వాత సీటు ఇప్పించకపోవడంతో తిరిగి డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయగా, వివిధ దశల్లో రూ.29.50 లక్షలు తిరిగి చెల్లించింది. మిగిలిన రూ.31.88 లక్షలు ఇవ్వలేదు. పలుమార్లు సంప్రదించిన ఫలితం లేదని పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి పరారీలో ఉన్న రమ్యను గుర్తించి అరెస్టు చేసి, కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

కార్మికురాలి హత్య కేసులో.. ముగ్గురికి జీవితఖైదు

అడయార్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కార్మికురాలి హత్య కేసులో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి జీవిత కారాగారశిక్షను విధిస్తూ నాగపట్టణం జిల్లా కోర్టు తాజాగా తీర్పునిచ్చింది. ఈ తీర్పు వివరాలను పరిశీలిస్తే... జిల్లాలోని ముట్టం కీళ్‌వీధికి చెందిన పరమశివం కుటుంబానికి అదే ప్రాంతానికి చెందిన నరసింగమూర్తి (60) కుటుంబంతో మనస్పర్థలున్నాయి. 2022లో ఈ రెండు కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. దీంతో పరమశివం, ఆయన భార్య భాగ్యవతి, కుమారుడు మహాదేవన్ కలిసి నరసింగమూర్తి గొంతుకోసి హత్య చేశారు. ఈ కేసు విచారణ జరిపిన నాగై జిల్లా కోర్టు న్యాయమూర్తి తుది తీర్పు వెలువరించారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితులు పరమశివం, భాగ్యవతి, మహాదేవన్‌లకు జీవితకారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో వారిని పోలీసులు కడలూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

'ఉంగళుడన్ స్టాలిన్'తో సమస్యల పరిష్కారం

● ఎమ్మెల్యే చంద్రన్



ప్రజలకు సహాయాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

తిరుత్తణి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు యూనియన్‌లోని ఓ కల్యాణమండపంలో గురువారం ఉదయం 'ఉంగళుడన్ స్టాలిన్' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వంలో ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కారమవుతున్నాయని, అదే విధంగా రాష్ట్రాభివృద్ధికి కోసం సీఎం స్టాలిన్ నేతృత్వంలోని నేతలు, అధికారులు ప్రజలకు అందుబాటులో వుంటూ ఎప్పటికప్పుడు ప్రజల అభ్యర్థలకు, సమస్యలకు పరిష్కారం చూపుతున్నారన్నారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం, వృద్ధులకు ఆరోగ్య కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పళ్లిపట్టు యూనియన్ కార్యదర్శి సీజే.సెందిల్‌కుమార్, డీఎంకే న్యాయవాది సీజే.శ్రీనివాసన్, పట్టణ చైర్మెన్ ఎస్.మణిమేకళై మమహేంద్రన్, కౌన్సిలర్ మురళి సహా పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

28 నుంచి 'కానెక్స్ సౌత్ 2025' ప్రదర్శన



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

చెన్నై, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హైవే, మెట్రో కారిడార్లు, లాజిస్టిక్స్ హబ్‌లు, పారిశ్రామిక పార్కుల అభివృద్ధే లక్ష్యంగా ఈ నెల 28న 'కానెక్స్ సౌత్ 2025' పేరుతో ప్రత్యేక ప్రదర్శన ప్రారంభం కానుంది. నందంబాక్కంలోని ట్రేడ్‌సెంటర్‌లో 30వ తేదీ వరకు జరిగే ఈ ప్రదర్శనను ముఖ్యమంత్రి స్టాలిన్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. తమిళనాడు హైవేస్ కాంట్రాక్టర్స్ ఫెడరేషన్ (టీఎన్‌హెచ్‌సీఎఫ్) భాగస్వామ్యంతో మెస్సీ ముయెన్సస్ ఇండియా నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో జేసీబీ ఇండియా యాక్షన్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్, టాటా హిటాచి, హ్యూడీ హ్యూండాయ్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ వంటి 110కి పైగా ప్రముఖ బ్రాండ్లు ఈ ప్రదర్శనలో పాల్గొననున్నాయి. టీఎన్‌హెచ్‌సీఎఫ్ అధ్యక్షుడు ఎం.తిరుసాంగు, మెస్సీ ముయెన్సస్ ఇండియా సీఈవో భూపిందర్ సింగ్ తదితరులు చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు.

తిరుచెందూరులో వెండి సప్పరంలో ఊరేగిన మురుగప్పెరుమాన్



తిరుచెందూరు ప్రధానవీధిలో సాగుతున్న రథం

చెన్నై, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం ఇష్టదేవేరులతో స్వామివారు వెండి సప్పరంలో విహరించారు. ఈ ఆలయంలో ఈ నెల 14న ప్రారంభమైన ఆవణి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ స్వామివారు వివిధ వాహన సేవల్లో పాల్గొంటున్నారు. ఆ మేరకు గురువారం ఉదయం స్వామివారు షణ్ముఖ బ్రహ్మ అంశంగా శ్వేత పట్టువస్త్రాన్ని ధరించి సప్పరంపై ఆశీనులయ్యారు. స్వామివారికి ఇరువైపులా ఇష్టదేవేరులైన వళ్ళి, దైవానై సర్వాలంకరణలతో వేంచేశారు. ఈ వెండి సప్పరం ఊరేగింపు ఉదయం 11.30 గంటల వరకు కొనసాగింది. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం శనివారం ఉదయం జరుగనుంది.

● జయ పన్ను బకాయిల వ్యవహారం....

ఐటీ నోటీసుపై హైకోర్టులో దీపాకు ఊరట



చెన్నై, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి జయలలిత చెల్లించాల్సిన పన్ను బకాయిలను ఆమె మేనకోడలు దీప చెల్లించాలంటూ ఐటీ అధికారులు ఇచ్చిన నోటీసుపై హైకోర్టు స్టే విధించింది. గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం జయకు వారసులుగా జె.దీపా, జె.దీపక్ ఉన్నారు. ఈ నేపథ్యంలో జయ చెల్లించాల్సిన రూ.36.56 కోట్ల పన్ను బకాయిలను వారం రోజుల్లోగా చెల్లించాలంటూ జూలై 23న దీపాకు ఐటీ నోటీసు పంపింది. దానిని రద్దు చేయాలని కోరుతూ దీపా హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి కృష్ణన్ రామసామి ఎదు ట విచారణకు వచ్చింది. ఆ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది ఎం.చంద్రకుమార్ వాదనలు వినిపిస్తూ పన్ను బకాయిలను వారం రోజుల్లోగా చెల్లించాలని ఆదాయపు పన్ను శాఖ ఆదేశించడం తగదన్నారు. అంతేగాక జయ చెల్లించాల్సి పన్ను ఆమె వారసులు చెల్లించాలనే అధికారం ఐటీ శాఖకు లేదని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఉటంకించారు. అందువల్ల ఆ నోటీసులను రద్దు చేయాలని, ఆ నోటీసులోని ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వాలని కోరారు. ఆ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి ఐటీ శాఖ ఇచ్చిన నోటీసుపై స్టే విధించారు. ఆదాయపు పన్నుశాఖ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను సెప్టెంబర్ 2వ తేదీకి వాయిదా వేశారు.

సీఎం సోదరుడికి అస్వస్థత

● అపోలో ఆస్పత్రిలో చికిత్స

ప్యారీస్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ సోదరుడు తమిళరసు (69) అస్వస్థత కారణంగా థౌజండ్‌లైట్స్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ట్రస్ట్‌పురంలో నివసిస్తున్న తమిళరసు బుధవారం ఉదయం వాకింగ్ చేస్తూ హఠాత్తుగా వాంతులు చేసుకుని స్పృహ కోల్పోయారు. ఆయనను వెంటనే అంబులెన్స్‌లో అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు చేయగా ఫుడ్ అలర్జీ కారణంగా అస్వస్థతకు గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ఆస్పత్రికి వెళ్లి సోదరుడిని పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

మద్యం మత్తులో భార్య హత్య

● తొమ్మిదేళ్ళ తర్వాత భర్త అరెస్టు

అడయార్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలోని పొండరీకపురంలో భార్యను హత్య చేసిన భర్తను తొమ్మిదేళ్ళ తర్వాత అరెస్టు చేశారు. ఈ గ్రామానికి చెందిన మోహన్‌రాజ్ (45), జయచిత్ర (40) అనే దంపతులున్నారు. అయితే, మోహన్ రాజ్ మద్యానికి బానిసై 2016 ఏప్రిల్‌లో భార్యపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అయితే, భార్య చనిపోయిన విషయాన్ని తెలుసుకున్న మోహన్ రాజ్ ఊరి వదిలి పారిపోయాడు. అప్పటి నుంచి పోలీసులు మోహన్ రాజ్ కోసం గాలిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం తిరువిడైమరుదూరులో ఉన్న మోహన్ రాజ్‌ను పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు.

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు సమీపంలోని ఎన్‌ఎన్.కండిగైలో కుశస్థలి నదిపై వంతెన నిర్మాణానికై గురువారం ఉదయం ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ప్రజలకు ఎన్నో రకాల పథకాలను అమలుపరుస్తోందని, ఇందులో భాగంగా సుమారు రూ.కోటి వ్యయంతో కుశస్థలి నదిపె వంతెన నిర్మాణం పనులు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంకే మండల కన్వీనర్ విజయ్‌కుమార్, ప్రజాపనులశాఖ ఉన్నతాధికారులు, స్థానిక డీఎంకే నేతలు పాల్గొన్నారు.

ఈపీఎస్ కేసు విచారణపై స్టే తొలగించిన హైకోర్టు

చెన్నై, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా ఎన్నికవడాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చాలంటూ ఆ పార్టీ నేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) దాఖలు చేసిన పిటిషన్‌ను సివిల్‌కోర్టు తోసిపుచ్చుతూ జారీ చేసిన ఉత్తర్వుపై స్టే విధించిన హైకోర్టు తాజా విచారణ సందర్భంగా ఆ స్టే ఉపసంహరించుకోనున్నట్లు ప్రకటించింది. 2022 జూలై 11న జరిగిన సర్వసభ్యమండలి సమావేశంలో ఈపీఎస్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావటాన్ని, ఆ సమావేశంలో చేసిన తీర్మానాలను వ్యతిరేకిస్తూ దిండుగల్‌కు చెందిన సూర్యమూర్తి సివిల్ కోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్ తోసిపుచ్చాలని కోరుతూ ఈపీఎస్ వేసిన పిటిషన్‌ను జూలైలో విచారించిన సివిల్ కోర్టు తోసిపుచ్చింది. ఆ నేపథ్యంలో సివిల్‌కోర్టు ఉత్తర్వును రద్దు చేయాలని ఈపీఎస్ హైకోర్టులో అప్పీలు పిటిషన్ వేశారు. అదే సమయంలో సివిల్‌కోర్టులో కేసు వేసిన పిటిషనర్ సూర్యమూర్తి హైకోర్టులో ఓ కేవియట్ దాఖలు చేశారు. ఈపీఎస్ అప్పీలు పిటిషన్‌పై తమ తరపు వాదనలు విన్నతర్వాతే హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయాలని కేవియట్‌లో పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం ఈపీఎస్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి పీపీ బాలాజీ సివిల్‌కోర్టు ఈపీఎస్ పిటిషన్‌ను తోసిపుచ్చుతూ ఇచ్చిన ఉత్తర్వుపై స్టే విధించారు. ఈ నేపథ్యంలో సూర్యమూర్తి తరపు న్యాయవాదులు న్యాయమూర్తి పీపీ బాలాజీ ఎదుట హాజరై తమ కేవియట్ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోకుండా ఈపీఎస్‌కు సానుకూలంగా స్టే ఇచ్చారని, తాము కేవియట్ వేసిన విషయాన్ని దాచి ఈపీఎస్ వర్గీయులు స్టే పొందారని వివరించారు. ఆ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి ఈపీఎస్ అప్పీలు విచారణ సందర్భంగా సివిల్‌కోర్టు ఇచ్చిన ఉత్తర్వును నిలుపుదల చేస్తూ వెలువరించిన మధ్యంతర స్టే ఉపసంహరించుకుంటున్నామన్నారు. తదుపరి విచారణ ఈ నెల 25కు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.



చెన్నై నందనం వైఎంసీఏ మైదానంలో 'సెంపొయిల్' సంస్థ ఆధ్వర్యంలో గ్రామోత్సవ వేడుకల్లో పాల్గొని అక్కడి జానపద సంగీత పరికరాలను ఆసక్తిగా వీక్షిస్తున్న మంత్రి అన్బిల్ మహేష్



రాయపేట న్యూకాలేజీలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థుల ప్రదర్శన

టీవీకే మహానాడు ప్రాంగణంలో ఏరులై పారిన మద్యం

ప్యారీస్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) మహానాడు ప్రాంగణాన్ని ఆ పార్టీ కార్యకర్తలు మద్యం బారుగా మార్చారు. మదురై సమీపంలోని పారాపత్తి ప్రాంతంలో గురువారం టీవీకే రెండో మహానాడు జరిగింది. దీని కోసం పలు జిల్లాల నుండి ఒక రోజు ముందు కార్యకర్తలు మహానాడు గ్రౌండుకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో, బుధవారం రాత్రి వేదిక ప్రాంగణంలో కార్యకర్తలు మద్య సేవించి మత్తులో ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ బాటిళ్లు అక్కడే పడేశారు. మహానాడు వేదిక ప్రాంగణం, బయట పార్కింగ్ స్థలంలో ఎటు చూసినా ఖాళీ సీసాలే కనిపించాయి. గురువారం ఉదయం కూడా పార్కింగ్ ప్రాంతంలో కూర్చున్న కొంతమంది కార్యకర్తలు మద్యం సేవించిన దృశ్యాలు డ్రోన్ కెమెరా బంధించింది. ఆ ఫొటోలను ప్రసారం చేయడంతో మందుబాబులు పరుగులు తీశారు. ఒకరోజు ముందే వచ్చిన కార్యకర్తలకు భోజనం, తాగునీరు తదితర కనీస వసతులు కల్పించకపోవడంతో స్థానిక వ్యాపారులు ఆహార పదార్థాలు, వాటర్ బాటిళ్ల అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఇదిలా వుండగా, పారాపత్తి ప్రాంతానికి సమీపంలోని ఆవియూర్ టాస్మాక్ దుకాణం ముందు బుధవారం రాత్రి, గురువారం టీవీకే కార్యకర్తలు బారులుదీరి మద్యాన్ని కొనుగోలు చేశారు. పారాపత్తి సమీపంలో ఉన్న ఎలియార్‌పత్తి, వలయన్‌కుళం, కార్యపట్టి ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలకు గురువారం మధ్యాహ్నం 12 నుంచి సెలవు ప్రకటించారు.



టాస్మాక్ దుకాణం ముందు బారులుదీరిన కార్యకర్తలు

మద్యం సీసాతో ఆలయానికి వెళ్లిన కార్యకర్తలు..

మదురై సమీపంలోని తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి మద్యం సీసాలతో వెళ్లిన టీవీకే కార్యకర్తలను దర్శనానికి అనుమతించలేదు. స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో ఉన్న భక్తులను తనిఖీ చేశాకే లోపలి అనుమతిస్తున్నారు. పోలీసుల తనిఖీల్లో టీవీకే కార్యకర్తలు కొంతమంది తమ బ్యాగుల్లో మద్యం సీసాలతో ఆలయానికి వెళ్లగా, పోలీసులు దర్శనానికి నిరాకరించారు.

వడదెబ్బకు సొమ్మసిల్లిన టీవీకే కార్యకర్తలు

సూర్యుడి ప్రతాపంతో మదురైలో జరిగిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) మహానాడుకు వెళ్లిన కార్యకర్తల్లో పలువురు వడదెబ్బకు గురై అస్వస్థతకు గురైయ్యారు. గురువారం ఉదయం 7 గంటల నుంచే మదురైలో ఎండలు మండిపోవడంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రత నమోదు కావడంతో టీవీకే మహానాడు ప్రాంగణంలో చిన్నారులు, మహిళలు వడదెబ్బకు గురై దాదాపు 50 మందికి పైగా సొమ్మసిల్లి పడిపోయారు. వీరిని అంబులెన్స్‌ల్లో సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.

విమర్శలకు గురైన బుస్సీ ఆనంద్...

టీవీకే మహానాడు ఏర్పాట్లను పరిశీలించేందుకు హెల్మెట్ లేకుండా ఆ ప్రాంగణంలో బైకు నడిపిన ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ విమర్శల పాలయ్యారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు, వెనుక కూర్చున్నవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చట్టం చెబుతోంది. ఆ క్రమంలో బుస్సీ ఆనంద్ కూడా హెల్మెట్ లేకుండా బైక్ నడిపి వార్తల్లోకి ఎక్కారు. ఇదిలా ఉండగా టీవీకే మహానాడు ప్రాంగణంలోపలకు పోలీసు వాహనాలు మినహా మరే వాహనానికి అనుమతిలేదని ప్రకటించారు. అయితే కొంతమంది కార్యకర్తలు అంబులెన్స్ వాహనంలో గురువారం ఉదయం "హానాడు ప్రాంతంలో బ్యారికేడ్ల వరకు వెళ్లారు. అంబులెన్స్ తనిఖీ చేసిన పోలీసులు అందులో రోగులు కాకుండా నలుగురు కార్యకర్తలను చూసి కిందకు దించేశారు.



వడ దెబ్బకు గురైన వారికి చికిత్స అందిస్తున్న వైద్యులు

ఐదు కిలోమీటర్లు నడిచివెళ్లిన కార్యకర్తలు...

టీవీకే మహానాడుకు వెళ్లిన కార్యకర్తలతో వేదిక, పరిసర ప్రాంతాలు కిక్కిరిపోయాయి. దీంతో మదురై ట్రాఫిక్ పోలీసులు కారియాపట్టి సహా పలుప్రాంతాలనుండి పారాపత్తికి ప్రభుత్వ బస్సులు,షేర్‌ఆటోలు, టూరిస్ట్ వాహనాలకు అనుమతించలేదు. పొరుగుప్రాంతాల నుండి వెళ్లిన కార్యకర్తలు మహానాడు ప్రాంగణానికి 5 కిలోమీటర్ల మేర ఎండను సైతంలెక్కచేయకుండా నడుచుకుంటూ వెళ్లారు.

బస్సులు-రైళ్లలో రద్దీ...

రాష్ట్రంలోని పలుప్రాంతాలనుండి మదురైకి నడిపిన బస్సులు, రైళ్లలో ప్రయాణికుల రద్దీ కనిపించింది.టీవీకే కండువా కప్పుకున్న కార్యకర్తలే పెద్దసంఖ్యలో ప్రయాణం చేశారు.

విజయ్ పేరుతో ప్రత్యేక పూజలు...

టీవీకే మహానాడులో పాల్గొనేందుకు వెళ్లిన కార్యకర్తల్లో కొందరు మదురై మీనాక్షి అమ్మన్ ఆలయం సహా చుట్టుపక్కల ఆలయాలను సందర్శించి తమపార్టీ అధినేత విజయ్ ఆరోగ్యంగా ఉండాలని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుప్పరంకుండ్రం, పాండి ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న కార్యకర్తలు 2026 అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే ఘన విజయం సాధించి విజయ్ ముఖ్యమంత్రి పీఠమెక్కాలని ఆయన పేరుతో పూజలు చేశారు.

'మద్రాస్ డే'... వేడుకలెందుకు?

ప్రతి ఏడాది ఆగస్టు 22న 'మద్రాస్ డే'గా జరుపుకుంటాం. మద్రాస్ నగర పుట్టుపూర్వోత్తరాలను, ఒక చిన్నప్రాంతం నుంచి మెట్రో నగరంగా ఎదిగిన వైనాన్ని అవలోకనం చేసుకుంటూ ఉత్సవాలు జరుపుకుంటున్నారు.. ఇలా ఎందుకు ఉత్సవాలు జరుపుకుంటున్నారన్నది చాలామంది సందేహం.. అదేంటో చర్చిద్దాం రండి..!

టి.నగర్, ఆంధ్రజ్యోతి

తెలుగు నాయుడి నుంచి భూమి కొనుగోలు చేసి..

బంగాళాఖాతానికి కూతవేటు దూరంలో నక్కలు సంచరించే నక్కలదిబ్బ (నరి మేడు), చెరకు తోటలతో తెలుగువాడైన వెంకటప్పనాయకుడి ఆధీనంలో ఉన్న ప్రాంతాన్ని ఆంగ్లేయుల ఏజెంట్ ప్రాన్సిస్ 16 వేల వరహాలకు 1639 ఆగస్టు 22న కొనుగోలు చేసిన రోజు నేడు. ఆ తర్వాత ఆంగ్లేయుల భద్రత కోసం, స్థానిక ప్రజల సంరక్షణార్థం ఓ కోట నిర్మించారు. రహదారులు, తాగునీటి సదుపాయాలు అందించారు. ఆ వసతులకు గాను స్థానికులపై పన్నులు విధించారు. పాలకులుగా మారి స్థానికులను బానిసలుగా, చిత్రహింసలు పెట్టారు. అలాంటప్పుడు ఈ మద్రాసు డే వేడుకలు అవసరమా అని కొందరు ప్రశ్నిస్తున్నారు. ప్రతి చెడు వెనుకా మంచి దాగి ఉంటుంది కదా!

ఐదు కుగ్రామాల సమ్మేళనం ఈ మహానగరం


ఆంగ్లేయులు కోటకు నలువైపులా చెల్లాచెదురుగా విసరేసినట్లుండే నాలుగైదు కుగ్రామాలను ఒక్కటిగా చేసి పట్టణంగా మార్చారు. ఆ తర్వాత వాణిజ్యనగరంగా, మహానగరంగా రూపాంతరం చెందిందీ చెన్నపట్నం ఉరఫ్ మద్రాస్ ఉరఫ్ చెన్నై. సముద్రతీరానికి చేరువగా ఉన్న ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయం, మైలాపూరు కపాలీశ్వరాలయం, మన్నడి కాళికాంబాళ్ ఆలయం, పురుషవాక్కంలోని గంగాదీశ్వరాలయం, తిరువొత్తియూరులోని వడివుడై అమ్మన్ ఆలయం వెయ్యేళ్లనాటివి. ఈ ఆలయాలకు సమీపంలోనే స్థానికులు జీవనం సాగించేవారు. చేనేత, చేపలవేట వీరి వృత్తి. అయితే వేల సంవత్సరాలు గడిచినా ఆ ప్రాంతాలను కుగ్రామాలుగా, కాలనీలుగానే పిలిచేవారు. ఫ్రాన్సిస్ డే ఈ ప్రాంతాన్ని కొనుగోలు చేసిన తర్వాతే ఆ ప్రాంతాలన్నీ కలిసి (చెన్న) 'పట్నం'గా రూపు దిద్దుకున్నాయి. ఈ చారిత్రక వాస్తవాలను గుర్తించినట్లయితే మద్రాసు డే జరుపుకోవడం అన్ని విధాలా సమంజసమేనన్న సమాధానం లభిస్తుంది.



త్యాగరాజభాగవతార్


భారతరత్న ఎంఎస్ సుబ్బలక్ష్మి

మద్రాసు డే కార్యక్రమాలు...

మద్రాసు డే వేడుకలు జరుపుకోవాలన్న ఆలోచన నగర ప్రఖ్యాత చరిత్రకారుడు దివంగత ఎస్.ముత్తయ్య, సీనియర్ పాత్రికేయుడు శశినాయర్, ప్రచురణ కర్త విన్సెంట్ డిసౌజాకు కలిగింది. 'ది మద్రాస్ డే' పేరుతో వెబ్‌సైట్ ఏర్పాటు చేసి 2005 నుండి ఈ వేడుకలను నగరంలోని విద్యావేత్తలు, నగర చరిత్ర బాగా తెలిసిన సీనియర్ సిటిజన్లు, అధ్యాపకులు, విద్యార్థులతో ఆగస్టు నెల అంతటా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ ముగ్గురికి ప్రముఖ పాత్రికేయులు సుశీల రవీంద్రనాథ్, రేవతి ఆర్, చరిత్రకారుడు వి.శ్రీరామ్ తోడయ్యారు. మద్రాసు వేడుకల్లో భాగంగా ఆగస్టు అంతా ఉదయం పూట చారిత్రక ప్రాంతాలకు పాదయాత్ర, పాఠశాలల్లో మద్రాసు నగర చరిత్రపై క్విజ్ కార్యక్రమాలు, మద్రాసు నగరానికి చెందిన చారిత్రక ప్రాంతాలపై చిత్రలేఖనం పోటీలు, ప్రత్యేక ప్రసంగ కార్యక్రమాలు, డాక్యుమెంటరీ ప్రదర్శన ఇలా ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.


మహాకవి భారతియార్



పట్టినత్తార్

హ్యాపీ బర్త్‌డే 'మద్రాస్'..

మహానగరానికి 386 ఏళ్లు

ఎందరో మహానుభావులు...

మద్రాసు నగరం వివిధ రంగాలకు చెందిన కళాకారులు, పారిశ్రామికవేత్తలు, నటీనటులు, విద్యావంతులు. వైజ్ఞానికవేత్తలు, మేధావులు, వ్యాపారులకు పుట్టిల్లుగా భాసిల్లింది. వీరిలో ఎనభైశాతం మంది స్థానికులు కాకపోయినా, ఇతర ప్రాంతాల నుండి వచ్చినా కన్నతల్లిలా ఆదరించి వారిని ఉన్నతస్థితికి చేర్చింది. ఆ నాటి తమిళ సినీరంగ తొలి 'సూపర్‌స్టార్' త్యాగరాజ భాగవతార్, పియూ చిన్నప్ప, ఎన్ఎస్ కృష్ణన్, శివాజీ గణేశన్, జెమినీ గణేశన్, ఎంజీఆర్, ముత్తురామన్, జయశంకర్, రవిచంద్రన్, రజనీకాంత్, పద్మిని, సరోజాదేవి, భానుమతి, షావుకారు జానకి, సావిత్రి, కేవీ మహదేవన్, ఎంఎస్ విశ్వనాథన్, ఇళయరాజా నుంచి నేటి అజిత్, విజయ్, ధనుష్, శింబు, బాలచందర్, భారతీరాజా, భాగ్యరాజా, టీ రాజేందర్, వసంత్, ఎస్‌జే సూర్యా, రోజా, ఖుష్బూ, దేవయాని, రాధ, అంబిక వంటి కళాకారులు తామెంచుకున్న రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. ఇక ద్రవిడ ఉద్యమనేత పెరియార్, రాజాజీ, కామరాజర్, అన్నాదురై, ఎంజీఆర్, కరుణానిధి, జయలలిత, మూప్పనార్, జీకే వాసన్, పి. చిదంబరం, వైగో, విజయకాంత్, శరత్‌కుమార్ వంటి రాజకీయ నేతలు పేరుగడించడానికి ఈ నగరమే దోహదపడింది. మహాకవి భారతీయార్, పుదుమైపిత్తన్, కల్కి, జానకిరామన్, కన్నదాసన్, వైరముత్తు, సుజాతా వంటి రచయితలు, కవులకు ఆశ్రయమిచ్చింది. అన్నామలై శెట్టియార్, మెయప్పశెట్టియార్, అళగప్ప శెట్టియార్, స్పిక్, అమాల్గమేషన్, టీవీఎస్, గోయెంకా, జెమినీ వంటి సంస్థలు ఇక్కడే ఆవిర్భవించి ఆకాశమంత ఎత్తుకు ఎదిగాయి. భారతరత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి, రుక్మిణి అరుండేల్, లాల్గుడి జయరామన్, వీణ గాయత్రి, సుధారఘునాథన్ వంటి మేటి సంగీత దిగ్గజాలను కూడా అందించింది. 1990 వరకు నగరంలో పేరుమోసిన రౌడీలు కూడా ఈ నగరానికి చెందినవారు కారని అప్పటి పోలీసు రికార్డులు చెబుతున్నాయి. మదురై, తిరునల్వేలి, కోవై, తిరుచ్చి వంటి నగరాల నుంచి పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుండి ఉపాధి కోసం, వ్యాపారం కోసం వచ్చినవారిని కూడా ఈ నగరమే ఆదరించింది. దేశంలో ఏ రాజధాని నగరంలోనూ లేనంతగా ఈ మద్రాసు నగరంలోనే గుజరాత్, రాజస్థాన్, బిహార్, ఒడిశా, బెంగాల్, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన వారు అధికసంఖ్యలో వచ్చి స్థిరపడిపోయారు. నగర ఆవిర్భావానికి ముందు అన్నదమ్ముల్లా కలిసిమెలసి జీవనం సాగించిన తమిళులతో, తెలుగువారితో వీరంతా మమేకమై ఆత్మీయులుగా మారిపోయారు. భాషలు, సంస్కృతులు వేరైనా తామంతా ఐకమత్యంగానే జీవిస్తామని శపథం చేసుకున్నట్లు అప్పుడూ, ఇప్పుడూ ఒకే తల్లి బిడ్డల్లా కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. ఇలా రాష్ట్రేతరులంతా తమ సొంతూళ్లకు పండుగలూ పబ్బాలకు మాత్రమే వెళ్లి వస్తున్నారంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇక రోజుకూలీలు, ఆటో డ్రైవర్లు, భవననిర్మాణ కార్మికులు, కర్మాగారాలలో పనిచేసే కార్మికులు, రిక్షా కార్మికులు వందల సంఖ్యలో నగర నాగరితకు సాక్ష్యమిచ్చే కూవం కాలువ ఒడ్డున రేకుల షెడ్లు, పూరిగుడిసెల్లోనే నివసిస్తున్నారు. ఇప్పటి సంగతేమిటో కానీ, ఈ నగరం మద్రాసు పేరుతో చెలామణి అయినప్పుడు వల్లలార్‌గా కీర్తిగడించిన రామలింగ అడిగళార్ ఈ నగరాన్ని 'ధర్మమిగు చెన్నై' అని కొనియాడారు. అంటే ఈ నగరంలో ధర్మం సుస్థిరంగా ఉంటోందని అర్థం. ఎక్కడో పూంపుహార్‌లో జన్మించి, విదేశీ వాణిజ్యం ద్వారా ధనవంతుడై విలాసాలను అనుభవిస్తున్న వ్యాపారవేత్త, కోట్లకు పడగలెత్తినా, ప్రాణం పోయాక చెవితెగిన సూది కూడా వెంటరాదనే జీవితసత్యాన్ని గ్రహించి, సకల సంపదలను త్యజించి దేశసంచారం చేస్తూ ఈ నగరంలో పాదం మోపిన సన్యాసి 'పట్టిణత్తార్' సజీవ సమాధి నొందిన ప్రాంతం తిరువొత్తియూరు. అక్కడే ఆయన శివలింగ రూపంలో ఆలయంలో పూజలందుకుంటున్నారని చాలామందికి తెలియదు. ఈ నగరంలోనే ఎంతోమంది సిద్ధపురుషులు దేశ సంచారం చేస్తూ సజీవ సమాధి నొందినట్లు చరిత్ర చెబుతోంది. ఇంతటి కీర్తి సంతరించుకున్న ఈ నగరానికి మద్రాస్ డే పేరుతో ప్రతియేటా జన్మదినవేడుకలు జరుపుకోవటం అన్ని విధాలా సమంజసమే. కాదంటారా?







నల్లి సిల్క్స్ భవనం - కేరళ హెయిర్ డ్రెసెస్ ప్రవేశద్వారం - పాండ్యన్ కాఫీ షాపు

సెంచరీ దాటిన 'తూంగా నగరం'

టి.నగర్, ఆంధ్రజ్యోతి

తమిళనాడు రాజధాని చెన్నైలో టి.నగర్‌గా పిలువబడుతున్న త్యాగరాయనగర్ ప్రముఖ వాణిజ్యకేంద్రం. మదురై లాగే ఈ ప్రాంతానికి కూడా 'తూంగా నగరం' (నిద్రపోని నగరం)గా పేరుంది. వందేళ్ల క్రితం నుంగంబాక్కం చెరువు, లాంగ్ చెరువు మధ్య ఉన్న ఈ భూభాగంలో గుంటనక్కల నివాసంగా ఉండేదని చెబితే ఎవరైనా నమ్ముతారా?.. 1923లో త్యాగరాయనగర్ ఆవిర్భవించింది. 1925 నుండి తన రూపు రేఖలను మార్చుకుంటూ ఇటీవలే వందేళ్లు పూర్తి చేసుకుంది. మొదట జనావాస ప్రాంతంగా పురుడు పోసుకున్న ప్రాంతం పాండీబజార్, రంగనాథన్ వీధి ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన జౌళి, బంగారు దుకాణాలు, ఇత్తడి, స్టీలు పాత్రల దుకాణాల కారణంగా రాకెట్ స్పీడుతో వాణిజ్య కేంద్రంగా మారింది. త్యాగరాయనగర్ ఆవిర్భవించిన పది, పదిహేను సంవత్సరాల్లోనే రోడ్లకిరువైపులా దుకాణాలు వెలిశాయి. వ్యాపారాలు పుంజుకోవడంతో దక్షిణాది ప్రాంతాల నుండి వలస వచ్చినవారంతా చిన్న చిన్న దుకాణాలను ప్రారంభించి నేడు తమ శాఖలను దేశవ్యాప్తంగా విస్తరింపజేసి పారిశ్రామికవేత్తలుగా ఎదిగారు. కాలగమనంలో కొన్ని ప్రముఖ దుకాణాలు కనుమరుగయ్యాయి. మరికొన్ని దుకాణాలు ఆరేడు దశాబ్దాలుగా తమ రూపురేఖల్ని మార్చుకోకుండా సేవలను కొనసాగిస్తున్నాయి.

మాంబళం రైల్వేస్టేషన్‌తో మార్పులు...

త్యాగరాయనగర్ ప్రాంతం రూపురేఖల్ని పూర్తిగా మార్చిన ఘనత మాంబళం రైల్వేస్టేషన్‌కే దక్కుతుంది. ఆ రైల్వేస్టేషన్ ఏర్పాటుతోనే ఈ ప్రాంతంలో ఊహించని మార్పులు వచ్చాయి. ఎగ్మూరు ప్రాంతాన్ని కాంచీపురంతో కలిపే లక్ష్యంతో రైలు సేవల విస్తరణలో భాగంగా 1911లో మాంబళం రైల్వేస్టేషన్ నిర్మించారు. ఈ స్టేషన్ రైల్వేలైన్ వెస్ట్ మాంబళంకు నేడు త్యాగరాయనగర్‌గా ఉన్న ఈస్ట్ మాంబళం మధ్య అడ్డుగోడలా ఉండేది. అక్కడ రైల్వేస్టేషన్ ఏర్పాటు కాగానే దక్షిణాది జిల్లాల వ్యాపారులంతా దుకాణాలు ప్రారంభించి వ్యాపారం చేయడానికి వచ్చారు. 1928 వరకు కాంచీపురం వరకే పరిమితమైన నల్లి కుటుంబీకులను కూడా ఈ ప్రాంతం ఆకర్షించింది. చిన్నసామిచెట్టి పట్టు చీరలను కాంచీపురం నుండి మాంబళం తీసుకొచ్చి, ఆ తర్వాత అక్కడి నుంచి మైలాపూరు వెళ్లి చీరలను అమ్మి స్వస్థలానికి వెళుతుండేవారు. మాంబళం ప్రాంతం అభివృద్ధి చెందుతున్నట్లు తెలియటంతో ఆయన 1928లో తమ దుకాణాన్ని తెరిచారు. మాంబళం రైల్వేస్టేషన్ వల్ల వ్యాపారులు, కస్టమర్ల మధ్య త్యాగరాయనగర్ ప్రాంతం ఆత్మీయ వారధి నిర్మించిందనడంలో అతిశయోక్తి లేదు. ఈ వాణిజ్య కేంద్రం రూపకల్పనలో పచ్చటి చెట్లు, జంతువులు కనుమరుగయ్యాయి. రంగనాథన్ వీధిలో నివసించిన ప్రముఖ తమిళరచయిత అశోకమిత్రన్ తన పుస్తకంలో త్యాగరాయనగర్‌లో గుంటనక్కలు ఎక్కువగా నివసించినట్లు పేర్కొన్నారు. 2013లో ఎకనామిక్ టైమ్స్ వెలువరించిన నివేదిక ప్రకారం త్యాగరాయనగర్‌లో ప్రతియేటా రూ.20వేల కోట్ల మేరకు దుస్తులు, నగలు అమ్ముడవుతున్నాయి. ముంబయిలోని లింగీ రోడ్డు, ఢిల్లీలోని కన్నాట్‌ప్లేస్, బెంగళూరు బ్రిగేడ్ ప్రాంతాల్లో జరిగే వ్యాపారం కన్నా ఇది రెండింతలు అధికమని ఆ నివేదిక చెబుతోంది. ఇంతటి కీర్తిని సంతరించుకున్న త్యాగరాయనగర్ ప్రాంతంలో వేగంగా పరుగెడుతున్న కాలచక్రంలో తన పాత సంస్కృతిని విడువక సేవే పరమావధిగా నగరవాసులను ఆకట్టుకున్న కొన్ని సంస్థలు స్థిరంగా తమ సేవలను ఇంకా కొనసాగిస్తున్నాయి. 1939లో వి.శంకున్నినాయర్ ప్రారంభించిన కేరళ హెయిర్ డ్రెసెస్ తన పాత రూపురేఖలతోనే బెల్జియం అద్దాలు, పాతకాలపు గోడగడియారం, కస్టమర్లకోసమే ప్రత్యేకంగా తయారు చేయించిన వలయాకారంలో తిరిగే కుర్చీలతో నడుస్తోంది. ప్రస్తుతం సెలూన్‌షాపును శంకున్ని నాయర్ మనవడు సందీప్ నడుపుతున్నారు. మూడు తరాలుగా నడుస్తున్న ఈ సెలూన్‌లోనే నటులు సత్యరాజ్, శివకుమార్, విజయకాంత్ వంటివారెంతో మంది తమ కురులకు మెరుగులు దిద్దుకునేవారు. ఈ రీతిలోనే పాండీబజార్‌లో 1958 నుండి చిక్కటి ఫిల్టర్ కాఫీ పొడి సరఫరా చేసే పాండ్యన్ కాఫీస్ కూడా స్థానికులకు దశాబ్దాలుగా కాఫీ రుచులను అందిస్తోంది. ఈ దుకాణం వ్యవస్థాపకుడు మహాలింగం తన సోదరుడు పాండ్యన్ పేరుతో ఈ కాఫీ పొడి దుకాణాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఈ షాపు రామలింగం నడుపుతున్నారు. ఈ ప్రాంతాన్ని పాండీ బజార్ అని పిలవటం వెనుక రెండు కారణాలు ఉన్నాయి. మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు ఊదంబట్టి పున్నైవన్ అయ్యా సౌందరపాండ్యన్ పేరుతో ఈ 'అంగడి వీధి' నిర్మితమైంది. మొదట సౌందర పాండ్యనార్ బజార్‌గా పిలుబడిన ఈ ప్రాంతం కాలగమనంలో పాండీ బజార్‌గా సంక్షిప్త నామదేయాన్ని సంతరించుకున్నట్లు చెబుతారు. త్యాగరాయనగర్ జనావాస ప్రాంతంగా మారుతున్నప్పుడు పాండిచ్చేరికి చెందిన పారిశ్రామికవేత్త చొక్కలింగ మొదలియార్ ఈ ప్రాంతానికి వచ్చి పదికి పైగా దుకాణాలను ఏర్పాటు చేశారు. ఆ దుకాణాలే ఈ ప్రాంతం వాణిజ్య కేంద్రంగా మారటానికీ శ్రీకారం చుట్టాయి.. పాండిచ్చేరి నుంచి వచ్చిన వ్యాపారి కనుక ఆయన నిర్మించిన దుకాణాలున్న ప్రాంతానికి 'పాండీబజార్' అనే పేరొచ్చిందని కూడా చెబుతారు. ఆ పాండిచ్చేరి పారిశ్రామికవేత్త నిర్మించిన దుకాణలలో ఎన్నో అదృశ్యమయ్యాయి. అలంకార్ డ్రెసెస్ దుకాణం ఉన్న 'అలంకార్ కాంప్లెక్స్' భవనం ఇంకా అలనాటి పాతవాసనలతోనే ఇప్పటికీ కనిపిస్తోంది. అలంకార్ డ్రెసెస్ దుకాణం ఉన్న చోట ప్రస్తుతం 'క్రాక్స్' దుకాణం నడుస్తోంది. ఇక దశబ్దాల తరబడి మందులు విక్రయించిన విల్సన్ మెడికల్ షాపు, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ఉపయోగించిన పెన్నులు తయారు చేసిన గామా పెన్స్ బ్రాంచి ఈ ప్రాంతంలోనే ఉండేది. గత యేడాది ఆ దుకాణం మూతపడింది.


కేరళ హెయిర్ డ్రెసెస్ షాపు లోపలి భాగం

నేటి రైళ్లకు తాతముత్తాతలు

ఈ ట్రామ్‌లు!



టి.నగర్, ఆంధ్రజ్యోతి

మద్రాసు నగరంలో నలుమూలలా పరుగులు తీసిన ట్రామ్‌ల గురించి, వాటిని నడిపిన మద్రాస్ ఎలక్ట్రిసిటీ సిస్టమ్ (ఎంఈఎస్) అనే కంపెనీ గురించి నేటి తరానికి తెలియకపోవచ్చు. ఆ ట్రామ్‌లన్నీ ప్రజలు నడక కంటే కొంచెం ఎక్కువ వేగంతో ఉండేవి. ఆ ట్రామ్‌ల గరిష్ట వేగం గంటకు 7 కిలోమీటర్లు. నగరవాసులు తలచుకుంటే వేగవంతమైన నడకతో ట్రామ్ వేగాన్ని సులువుగా అధిగమించగలుగుతారు. మద్రాసు నగరంలో 1895 నుండి 1953 వరకు 'టంగ్ టంగ్' మంటూ గంట కొడుతూ ఈ ట్రామ్‌లు చేసిన సందడి అంతా ఇంతా కాదు. ఈ ట్రామ్‌లు తంగసాలై (మింట్), బీచ్‌రోడ్డు, ప్యారీస్ కార్నర్, మౌంట్ రోడ్డు, పూందమల్లి హైరోడ్డు దాకా నడిచిన ఈ 'యాంత్రిక నత్తలు' నేటి తరానికి వింతగా అనిపించవచ్చు. కానీ ఆ నాటి మద్రాసువాసులందరికీ ఈ ట్రామ్‌లో ప్రయాణించడం నిత్యకృత్యం. సుమారు వంద ట్రామ్‌ల వరకు మద్రాసు నగరమంతటా పరుగులు తీశాయి. అప్పట్లో ఈ ట్రామ్‌లు సమయపాలన పాటించేవి. నిర్ణీత సమయాల్లో నిర్దేశిత ప్రాంతాల్లో నిలిచి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తుండేవి. ఈ ట్రామ్‌లను నుదుట నామం ధరించిన తెలుగువారే నడిపారని చరిత్రకారులు చెబుతారు. ఈ ట్రామ్‌లే నేటి విద్యుత్ లోకల్ రైళ్లకు, వందేభారత్ రైళ్లకు తాత ముత్తాతలు!



1950 నుండి సిటీ బస్సుల సంచారం పెరగడం, వాటి వేగం ట్రామ్‌ల వేగానికి నాలుగింతలుగా ఉండటంతో క్రమంగా ట్రామ్‌ల సేవలు తగ్గుతు వచ్చాయి. ఎంఈఎస్ కంపెనీ చివరకు అప్పులు ఊబిలో కూరుకుపోయింది. ఈ ట్రామ్ బండ్ల షెడ్ల స్థలాన్ని ఆ కంపెనీ అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం దినతంతి, పెరియార్ దిడల్ ఉన్న స్థలంలోనే ట్రామ్‌ల హాల్టింగ్ స్టేషన్ ఉండేది. ఆ స్థలం వేలానికి వచ్చినట్లు తెలుసుకున్న ద్రవిడ ఉద్యమనేత పెరియార్, దినతంతి యజమాని సీపా ఆదిత్తనార్, కోయంబత్తూరు సైంటిస్టు జీడీ నాయుడు కలిసి ఆ స్థలాన్ని కొనుగోలు చేశారు. నత్త వేగంతో నడిచిన ట్రామ్‌లు విశ్రాంతి తీసుకున్న ఆ ప్రాంతం నుండే రాష్ట్ర రాజకీయాల్లో, నగర రూపురేఖల్లో రాకెట్ వేగంతో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి.



1938లో మౌంట్‌రోడ్డులో నడుస్తున్న ట్రామ్

నంబెరుమాళ్ శెట్టియార్ సొంత రైలు...

నగరంలో నడిచిన ట్రామ్‌ల కథ పరిసమాప్తమైనప్పటికీ, నగరవాసుల రవాణా సదుపాయాలకు రైళ్లు, సిటీ బస్సులు, ప్రైవేటు బస్సులు అందుబాటులో ఉండేవి. రైళ్ల గురించి ప్రస్తావించేటప్పుడు నగరానికి చెందిన సివిల్ కాంట్రాక్టర్ ఒకరు తన సొంతానికి నాలుగు బోగీల రైలు ఉపయోగించారనే విషయం వింటే నేటి తరం ఆశ్చర్యపోతుంది. ఆ సివిల్ కాంట్రాక్టర్ పేరు 'తాటికొండ నంబెరుమాళ్ శెట్టియార్'. ఇంటిపేరు 'తాటికొండ'గా ఉండటంవల్ల ఆయన తెలుగువారేనన్నది సుస్పష్టం. అయితే మద్రాసు నగర చరిత్రలో ఆయన్ని ఆంగ్లం, సంస్కృత భాషల్లో ఆరితేరిన తమిళుడనే పేర్కొన్నారు.



గణితమేధావి రామానుజం - తాటికొండ నంబెరుమాళ్ చెట్టియార్


నంబెరుమాళ్ చెట్టియార్ శ్వేతసౌధం

చెట్‌పేట్ అసలు పేరు చెట్టియార్ పేటై..

నంబెరుమాళ్ ఆంగ్లేయుల ఈస్టిండియా కంపెనీకి కాంట్రాక్టర్‌గా పనిచేశారు. నగరంలో ప్రస్తుతం చారిత్రక వారసత్వ సంపదగా ఉన్న ఎరుపు రంగు భవనాలన్నీ ఆయనే నిర్మించినవే. మద్రాసు హైకోర్టు, లా కాలేజీ, ఎగ్మూరులోని శిల్ప కళాశాల,మ్యూజియం, కన్నిమెరా లైబ్రరీ తదితర భవనాలు ఆయన హయాంలోనే నిర్మాణం జరిగాయి. ఆంగ్లేయులకు పలు నివాసాలను కూడా ఈయనే నిర్మించారు. తిరువళ్లూరు వీరరాఘవ పెరుమాళ్ భక్తుడైన నంబెరుమాళ్ తరచూ ఆ ఆలయానికి కుటుంబ సమేతంగా తన సొంతరైలులో తిరువళ్లూరు వెళ్లేవాడు. ఆ రైలును సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో నిలిపి ఉంచేవారు. ఇక ఈ శెట్టియార్ నివాసభవనం 'వైట్‌హౌస్' (వెళ్లై మాళిగై)గా పేరుగడించింది. ఈ భవనం నేటికీ చెక్కుచెదరకుండా చెట్‌పేట్ ఫ్లైఓవర్ సమీపంలో డాక్టర్ మెహతా ఆస్పత్రి వెనుక మూడం తస్థులు, 30 గదులతో ఉంది. ఈ భవనం ప్రస్తుతం మ్యూజియంగా కొత్త రూపు సంతరించుకుంది. చైనా, జపాన్, ఇటలీ, ఇంగ్లాండు దేశాల నుంచి తెప్పించిన కళాత్మకమైన పింగాణీ వస్తువులెన్నో ఈ మ్యూజియంలో సందర్శనకు ఉంచారు. పాంథియన్ రోడ్డు నుండి హారింగ్టన్ రోడ్డు వరకు విస్తరించి ఉన్న ప్రాంతమంతా నంబెరుమాళ్ చెట్టియార్ సొంత భూములే. అందుకే ఈ ప్రాంతాన్ని 'చెట్టియార్ పేటై' అని పిలిచేవారు. కాలగమనంలో 'చెట్టిపేటై'గా, నేడు 'చెట్‌పేట్'గా మారింది.

గణితమేధావి రామానుజం అంటే ఇష్టం...

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన భారతీయ గణితమేధావి రామానుజం అంటే నంబెరుమాళ్ చెట్టియార్‌కు ఎంతో ఇష్టం. రామానుజం తన అంతిమ దినాలను చెట్టియార్ నివాసంలో గడిపారు. ఇంగ్లాండు నుంచి తిరిగొచ్చిన రామానుజంకు క్షయ వ్యాధి సోకి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ట్రిప్లికేన్‌లోని నివాసంలో రామానుజంకు వైద్యసేవలందించడానికి ఆయన కుటుంబీకులు, బంధువులు అయిష్టత వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న చెట్టియార్ రామానుజంను తన నివాసానికి తీసుకొచ్చి, ప్రత్యేకంగా ఓ గది కేటాయించి పనిమనుషులతో భోజన సదుపాయాలు కల్పించి, చికిత్స కూడా చేయించారు. అప్పట్లో మాంసం, కోడిగుడ్డు తింటే క్షయ వ్యాధి తగ్గుతుందని తెలుసుకున్న చెట్టియార్, వాటిని తినమని రామానుజంపై ఎంత ఒత్తిడి చేసినా ససేమిరా కుదరదని భీష్మించారు. చివరకు క్షయ వ్యాధితో రామానుజం కన్నుమూశారు. రామానుజం తమ మతాచారాలకు విరుద్ధంగా సముద్రం దాటి విదేశాల్లో పర్యటించారనే కారణంగా కుటుంబీకులు ఆయన భౌతిక కాయాన్ని స్వీకరించేందుకు నిరాకరించారు. దీంతో చెట్టియారే రామానుజంకు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. రామనుజం మరణధ్రువీకరణ పత్రం నంబెరుమాళ్ చెట్టియార్ నివాసంలో ఇప్పటికీ గోడకు వేలాడుతోంది. నంబెరుమాళ్ చెట్టియార్ మద్రాసు విశ్వవిద్యాలయంలో బీఏ పట్టాపొందారు. ఆంగ్లేయుల కంపెనీకి అధీకృత సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేశారు. ఇంపీరియర్ బ్యాంక్ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) తొలి భారతీయ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఇదే విధంగా మద్రాసు ప్రెసిడెన్సీ విధానమండలి సభ్యుడిగా నియమితులైన తొలి భారతీయుడు కూడా ఈయనే. మొట్టమొదటి విదేశీ కారు (ఫ్రెంచ్ డిట్కన్)ను కొనుగోలు చేసిన భారతీయుడి ఈయనే కావడం మరో విశేషం.

ఎలిఫెంట్‌గేట్ వద్ద తిరుమల గొడుగుల పరుగులెందుకు?

భారతదేశంలో మరెక్కడా జరగని ఓ మహోత్సవం మద్రాసు నగరంలో జరుగుతుంది. ఇది ఉత్తర మద్రాసు నగరవాసులు జరుపుకునే ఉత్సవం. ప్రతియేటా నగరవాసులు సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో 'తిరుపతి గొడుగుల ఊరేగింపు' నిర్వహించే తేదీ తెలుసుకుని తమ డైరీలో రాసుకోవటం ఆనవాయితీ. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో స్వామివారి ఊరేగింపునకు ముందూ వెనుకా గొడుగులను కూడా తీసుకెళ్తారు. ఏడడుగుల వ్యాసం, ఏడడుగుల ఎత్తు ఉన్న ఐదారు గొడుగులను పట్టు వస్త్రం, వెదురు, లేస్, మెరిసే జరీగలతో అందంగా తయారు చేస్తారు. ఈ పనులన్నీ ప్యారీస్ కార్నర్‌లో ఉన్న చెన్నై కేశవపెరుమాళ్ ఆలయంలోనే జరుగుతాయి. ఈ గొడుగులను తిరుమలేశుడికి సమర్పించేందుకు ఊరేగింపుగా తీసుకెళ్లడాన్నే 'తిరుపతి గొడుగుల ఉత్సవం' అని పిలుస్తారు. దేవరాజమొదలి వీధిలోని చెన్న కేశవ పెరుమాళ్ ఆలయం నుంచి ఈ గొడుగుల ఊరేగింపు ప్రారంభమవుతుంది. పూక్కడై, ఎన్ఎస్‌సీ బోస్ రోడ్డు, గోవిందప్పనాయకన్ వీధి, బైరాగి మఠం, వాల్‌టాక్స్ మీదుగా సాయంత్రం నాలుగు గంటలకు ఎలిఫెంట్ గేట్ (తమిళంలో యానైగవుని) ప్రాంతానికి చేరుతుంది. ఆ ఎలిఫెంట్ గేట్ ప్రాంతాన్ని తిరుపతి గొడుగుల ఊరేగింపు భక్తబృందం దాటడమే ప్రధానంగా మీడియా భావిస్తుంది. గొడుగుల ఊరేగింపు ఎలిఫెంట్ గేట్ ప్రాంతాన్ని చేరుకోవటానికి అరగంట ముందు నగరంలోని భక్తులతోపాటు ఆ ఊరేగింపు వెళ్లే ప్రాంతాల వారంతా 'తిరుపతి కొడై గళ్ యానైగవుని దాండిడుచ్చా?' (తిరుపతి గొడుగులు ఎలిఫెంట్ గేట్ ప్రాంతాన్ని దాటాయా) అని ప్యారీస్ కార్నర్‌లో నివసిస్తున్నవారికి ఫోన్ చేసి మరీ అడుగుతుంటారు. ఇలా అడగటానికి కారణమేమిటి? ఎలిఫెంట్ వద్ద ఊరేగింపు బృందం దాటడం అంతకష్టమా? దీని వెనుక ఓ ఆసక్తికరమైన కథ ప్రచారంలో ఉంది. తిరుమలేశుడు పద్మావతీదేవిని వివాహం చేసుకోవడానికి కుబేరుడి వద్ద అప్పు తీసుకున్నాడని, ప్రస్తుతం ఆ రుణానికి ఆయన వరుసగా వడ్డీలు మాత్రమే చెల్లిస్తున్నట్లు భక్తుల నమ్మకం. ఆ రీతిలోనే కుబేరుడి దగ్గర శ్రీనివాసుడు తీసుకున్న రుణం చాలక ఎలిఫెంట్ గేట్ వద్ద ఓ వడ్డీ వ్యాపారి నుండి కూడా అప్పు తీసుకున్నారని, ఆ కారణంగా అప్పిచ్చిన వ్యాపారి అడ్డుకుంటారనే భయంతో ఎలిఫెంట్ గేట్ వద్ద గొడుగుల ఊరేగింపు వేగం పుంజుకుంటుందని చెబుతారు. ఈ వింతగాథకు వత్తాసు కలిగించేలా ఎలిఫెంట్ గేట్ సమీపంలోని షావుకారుపేటలో వడ్డీలకు అప్పులిచ్చే వ్యాపారులు అధికంగా నివసిస్తుండటం గమనార్హం. మరో కథ కూడా ప్రచారంలో వుంది. ఆంగ్లేయులు ఎలిఫెంట్ గేట్‌కు సమీపంలో సెంట్రల్‌స్టేషన్ వద్ద శత్రువులు చొరబడకుండా ఉండేందుకు ఓ గోడ నిర్మించి, ఆ గోడకు సంబంధించి పన్నులు వసూలు చేసేవారట. ఉప్పుకూ, పప్పుకూ భారీగా పన్నులు విధించిన తెల్లదొరలు.. తిరుపతి గొడుగుల వైభవాన్ని చూసి వాటికి కూడా అదనపు పన్ను కట్టాలని బెదరిస్తారేమోనన్న భయంతో అక్కడ ఊరేగింపు వేగం పెంచేవారని కొంతమంది పెద్దలు చెబుతుంటారు.



తిరుపతి గొడుగుల ఊరేగింపు



త్రివిక్రమ్



తార



సౌమ్య రెడ్డి



గ్రీష్మ, ప్రతిభా భారతి

తిరుమలలో సినీ నటుల సందడి

తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సినీనటులు అక్కినేని నాగచైతన్య, శోభిత దూళిపాళ్ల దంపతులు, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, కన్నడ నటి తార, సౌమ్యరెడ్డి బ్రేక్ సమయంలో దర్శనం చేసుకున్నారు. ఇంకా మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, ఎమ్మెల్సీ గ్రీష్మ, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నృత్య కళాకారిణి ఆనంద శంకర్ జయంతి స్వామి దర్శనం చేసుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గదిలో మర్చిపోయిన బంగారు బ్రాస్‌లెట్

భద్రంగా అప్పగించిన అటెండర్

తిరుమల, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చి గదిలో మర్చిపోయిన బంగారు బ్రాస్‌లెట్‌ను టీటీడీ సిబ్బంది తిరిగి భక్తుడికి అందజేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన కల్లూరి వెంకట సుబ్బారావు అనే భక్తుడు కృష్ణసదన్‌లో గదని ఖాళీ చేసే హడావుడిలో పర్సు రూ.1.10 లక్షల విలువైన బ్రాస్‌లెట్, చేతి గడియారం మర్చిపోయి వెళ్లిపోయారు. అక్కడ అటెండర్‌గా పనిచేస్తున్న మహిధర్‌రెడ్డి గుర్తించి సూపరిటెండెంట్ విజయకుమార్‌కు అందజేశారు. అనంతరం భక్తుడికి వాటిని అప్పగించారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.45 కోట్లు


బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,688

తలనీలాలు సమర్పించినవారు: 29,099



బొమ్మల 'కొలువు'





వారి చేతిలో మట్టి వివిధ రూపాలను సంతరించుకుంటుంది. విగ్రహాలుగా ఆవిష్కృతమవుతుంది. దైవమే దిగివచ్చిన భావన కలగజేస్తుంది. తిరుపతిలో దశాబ్దాలుగా కొన్ని కుటుంబాలు కళను వారసత్వంగా కొనసాగిస్తూ విగ్రహాల తయారీలో విశిష్టతను చాటుకుంటున్నాయి.1960లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన షణ్ముగం.. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా తిరుపతిలో స్థిరపడ్డారు. ప్రస్తుతం విగ్రహాల తయారీదారులకు ఆయనే ఆద్యుడు. రకరకాల బొమ్మల తయారీలో ఆయనది అందెవేసిన చేయి. ఆయన స్ఫూర్తితో తర్వాత పాతిక కుటుంబాలు వచ్చి అదేబాటను అనుసరించాయి. 1983లో హైదరాబాదులో వీరు తయారుచేసి ప్రదర్శించిన 'కాళంగికృష్ణుడు' మట్టి బొమ్మను చూసి నాటి ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ ముచ్చటపడ్డారు. నంది అవార్డును కూడా బహూకరించారు. 1984లో ఈ కుటుంబాలకు ప్రభుత్వం మంగళం ప్రాంతంలోని చటర్జీనగర్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించింది. కాలక్రమేణా ఇదే బొమ్మ లక్వార్టర్స్‌గా ముద్రపడింది. ఏడాదిపొడవునా విగ్రహాలు తయారుచేయడమే ఇక్కడి వారి జీవనాధారమైంది. పండగలొస్తే చేతినిండా పనే. ప్రస్తుతం వినాయక చవితి సమీపిస్తున్న క్రమంలో వందలకొలదీ విగ్రహాల తయారీలో వీరంతా తలమునకలయ్యారు. మూడు అంగుళాల నుంచి 18అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను తయారుచేస్తున్నారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని నీటిలో కరిగిపోయే మెటీరియల్స్ మాత్రమే వినియోగిస్తున్నామని షణ్ముగం మనవడు తిరుమలప్రసాద్‌బాబు చెప్పారు. ఆర్డర్ల మేరకు ట్రెండుకు అనుగుణంగా వివిధ ఆకృతుల్లో విగ్రహాలు రూపుదిద్దుకుని ఆకట్టుకుంటున్నాయి. రూ.5వేల నుంచి రూ.70వేల వరకు వీటి ధర ఉంటుందని చెబుతున్నారు. ఇక్కడ తయారుచేసే బొమ్మల్లో ఎక్కువశాతం తమిళనాడు, కేరళ, కర్ణాటక నుంచి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. నెలరోజుల ముందునుంచే విగ్రహాల తరలింపు మొదలవుతుంది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి















30, 31 తేదీల్లో తిరుమల నంబి మహోత్సవాలు

తిరుమల, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణావాచార్యులు తిరుమలనంబి 1,052వ అవతార మహోత్సవాన్ని ఈనెల 30, 31వ తేదీల్లో నిర్వహించనున్నారు. తిరుమల దక్షిణ మాడవీధులోని తిరుమలనంబి ఆలయంలో 16 మంది ప్రముఖ పండితులు తిరుమలనంబి జీవిత చరిత్రపై ఉపన్యసించనున్నారు. శ్రీవారి భక్తాగ్రేసరులలో ఒకరైన తిరుమలనంబి భగవద్రామానుజుల వారికి మేనమామ, గురుతుల్యులు.

ఆ మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలపండి

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే భానుప్రకాష్ వినతి



సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గంలోని నగరి, విజయపురం, నిండ్ర మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రిని ఆయన కలిశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మరమగ్గ కార్మికులకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేయడంపై నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియ జేశారు. అనంతరం నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను చంద్రబాబుకు వివరించారు. కోసలనగరం పారిశ్రామిక కేంద్రం అభివృద్ధికి చర్యలు తీసుకుని యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విన్నవించారు. గాలేరు-నగరి ప్రాజెక్టుకు సంబంధించి పుత్తూరులో ఉన్న వేణుగోపాల సాగర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు సంబంధించిన వినతులు అందజేశారు. స్పందించిన సీఎం నియోజకవర్గ అభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు.

ప్రసన్నుడి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

వడమాలపేట,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామిని గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రధాన అర్చకుడు సూర్యకుమారాచార్యులు అభయ హస్తదీశుడి ఆలయ చరిత్రను జస్టిస్ సంజయ్ కరోల్‌కు వివరించారు. ఆశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారి వేణుగోపాల్ దర్శన ఏర్పాట్లు చేశారు.



తొలగించిన పింఛన్లు పునరుద్ధరించండి

● కలెక్టరేట్ వద్ద దివ్యాంగుల ఆందోళన ● కలెక్టర్ హామీతో విరమణ



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలగించిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలంటూ గురువారం కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగారు. తప్పిదాలకు తావిచ్చేలా సదరం సర్టిఫికెట్లను రద్దుచేసిన వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. శాస్త్రీయంగా రీవెరిఫికేషన్ చేయకనే జిల్లాలో 20వేలమంది పింఛన్లు తొలగించడం దుర్మార్గమన్నారు. వందశాతం వికలత్వం ఉన్నా పింఛను ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించారు. కలెక్టర్ వచ్చి తమ సమస్యను పరిష్కరించేంత వరకు కదిలే ప్రసక్తే లేదంటూ కలెక్టరేట్ రెండు ప్రధాన ద్వారాలను దిగ్బంధించారు. రోడ్డుపై పడుకుని ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్‌లోకి ఎవరినీ వెళ్లనీయలేదు. చివరకు డీఆర్వో నరసింహులు వద్దకు వచ్చి నచ్చచెప్పినా ససేమిరా అన్నారు. దాదాపు మూడు గంటల పాటు కలెక్టరేట్‌ను దిగ్బంధం చేసి చేసి దివ్యాంగులు ఆందోళన చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు పెద్దసంఖ్యలో చేరుకుని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. వైసీపీ నేత భూమన అభినయ్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తదితరులు వారికి సంఘీభావం ప్రకటించారు. చివరకు వాకాడు పర్యటనలో ఉన్న కలెక్టర్ వెంకటేశ్వర్‌తో డీఆర్వో నరసింహులు ఆందోళనకారులతో ఫోన్‌లో మాట్లాడించగా, ఆయన హామీతో నిరసన విరమించారు. కాగా, ఎక్కువసేపు ఎండలో ఉండటంతో జేఏసీ నాయకురాలు సుమతి స్పృహ తప్పి పడిపోవడంతో పోలీసులు ఆస్పత్రిని తరలించారు. ఈ నిరసనలో దివ్యాంగుల జేఏసీ నేతలు మురళీగౌడ్, మురళి, రామచంద్ర, గోవర్ధన్, చిట్టెమ్మ, చెంచులక్ష్మి, కాంచన, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల అంతర్ జిల్లా బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అంతర్ జిల్లా బదిలీలకు దరఖాస్తులు అందించాలని డీఈవో కేవీఎన్ కుమార్ కోరారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపధ్యాయులు, ఉపాధ్యాయులు, వారి సంబంధిత మేనేజ్‌మెంట్లకు స్పౌస్, పరస్పర బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. బదిలీలు ఆశిస్తున్న వారు ఈనెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. 21 నుంచి 24వ తేదీలోపు ఆన్‌లైన్ విధానంలో లీప్ యాప్ ద్వారా దరఖాస్తు సమర్పించి, ఆ ప్రింటవుట్‌ను సంబంధిత ఎంఈవోలకు సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఎంఈవోలు 25వ తేదీలోపు పరిశీలించి తదుపరి జాబితాను పరిశీలనార్థం డీఈవోకు పంపాల్సి ఉంటుందని తెలిపారు. వాటిని 26వ తేదీలోపు డీఈవో పరిశీలించి 27వ తేదీన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు సమర్పించనున్నారని పేర్కొన్నారు. బదిలీల ప్రతిపాదనలను రాష్ట్రస్థాయిలో పరిశీలించి 30వ తేదీన ఫైనల్ జాబితాను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు వెల్లడించారు.

తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు ఎస్పీకి ఐపీఎస్ హోదా

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్‌కు ఐపీఎస్ హోదా నిర్ధారిస్తూ ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో నాన్ క్యాడర్ ఎస్పీలుగా పనిచేస్తున్న 14 మందికి ఐపీఎస్ హోదా కల్పించిన విషయం విదితమే. ఈ గెజిట్‌ను నిర్ధారిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్ జారీ చేయడంతో గురువారం నుంచి కరీముల్లా షరీఫ్ ఐపీఎస్ హోదా లభించింది. ఐపీఎస్ హోదాలో త్వరలో ఆయన్ను ఎస్పీగా ఏదో ఒక జిల్లాకు నియమించనున్నారు.

దార్శనికతకు దర్పణం మాలతీ చందూర్ సాహిత్యం

● ధర్మనిధి సదస్సులో వక్తలు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ వాణి, ప్రొఫెసర్ మధుజ్యోతి, మునిసురేష్‌పిళ్లై తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మాలతీ చందూర్ తన సాహిత్యం ద్వారా మహిళలను తీవ్రంగా ప్రభావితం చేశారని పలువురు పేర్కొన్నారు. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో మాలతీ చందూర్ ధర్మనిధి సదస్సును గురువారం నిర్వహించారు. వర్సిటీ సోషియల్ సైన్స్, హ్యూమనిటీస్, మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ వాణి మాట్లాడుతూ.. మాలతీచందూర్ రచనలు తన అవగాహనను విస్తృత పరిచాయన్నారు. రచయిత మునిసురేష్‌పిళ్లై మాట్లాడుతూ.. మాలతీచందూర్ రచనల్లో దార్శనికత ప్రత్యేక లక్షణంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ద్రవిడ వర్సిటీకి చెందిన డాక్టర్ జి. శైలమ్మ మాట్లాడుతూ.. ఆంగ్ల సాహిత్య ప్రక్రియల్లోనూ మానవ సంబంధాల్లోని సున్నిత అంశాలను ఆమె రచనల్లోకి ప్రవేశ పెట్టారన్నారు. ఆంగ్ల ప్రొఫెసర్ తుమ్మపూడి భారతి మాట్లాడుతూ.. కళ ఆనందంతో పాటు జీవిత ఉన్నతికి తోడ్పడాలనే లక్ష్యం మాలతీ చందూర్ సాహిత్య విమర్శలో కనిపిస్తుందన్నారు. సభాధ్యక్షత వహించిన తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ.. మాలతీచందూర్ మహిళల జీవితంలోని ఆటుపోట్లను అద్భుతంగా చిత్రించారన్నారు. పద్మావతి వర్సిటీ తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ డి. యువశ్రీ, సదస్సు సంచాలకులు డాక్టర్ వై. సుభాషిణిలు మాట్లాడారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు పుస్తక బహుమతులను అందజేశారు. సాహిత్యవేత్తలు నెమిలేటి కిట్టన్న, ఆర్వీ కృష్ణస్వామిరాజు, డాక్టర్ డి.నల్లన్న, పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధుల కోసం తవ్వకాలు

● ఏడుగురి అరెస్ట్, ఎక్స్‌కవేటర్ సీజ్



నిందితులను, ఎక్స్‌కవేటర్‌ను చూపుతున్న పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నిధుల కోసం పొలంలో ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు జరిపిన కేసులో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు పోలీసుస్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆలత్తూరు గ్రామానికి చెందిన ఉమాశ్వర రెడ్డి తన బావమరిది ధనంజయరెడ్డికి చెందిన 30 ఎకరాలలో నీలగిరి చెట్లు పెంపకం చేపట్టి ఉన్నారు. ఈ పొలంలో పురాతన తులసికోట ఉంది. ఆ తులసికోట కింద నిధులు ఉన్నాయనే అనుమానంతో ఈ నెల 18న పొలంలో రాత్రి పూట కొందరు తవ్వకాలు జరిపారు. తోటకు కాపలా ఉన్న వ్యక్తి గుర్తించి ఉమాశ్వరరెడ్డికి విషయం తెలియజేయడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు రెడ్డిగుంటబాడవ గ్రామానికి చెందిన ఎ.గురవయ్య, బీ.గురవయ్య, ఓజిలి మండలం హరివరం గ్రామానికి చెందిన చంద్రశేఖర్, అనిల్, హరీష్, అశోక్, శేఖర్‌లను అరెస్టు చేశారు. కేసు నమోదు చేశారు.

స్విమ్స్ మెడికల్ షాపునకు మూడు టెండర్లు

తిరుపతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌కు అనుబంధంగా ఉన్న శ్రీపద్మావతి ఆస్పత్రి ఎదుటగల మెడికల్ షాపుకు ఆహ్వానించిన ఈ- టెండర్లను గురువారం టీటీడీ రెవెన్యూ అధికారులు టెక్నికల్ బిడ్‌ను తెరిచారు. మూడు దరఖాస్తులు వచ్చినట్టు గుర్తించారు. టెండరు నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తులు ఉన్నాయా?లేదా? అని పరిశీలిస్తున్నట్టు తెలిసింది. జీఎస్టీ, బ్యాంక్ టర్నోవర్ వంటివాటిని పరిశీలించి టీటీడీ నిర్దేశించిన రూ.15లక్షల కన్నా ఎక్కువ అద్దెను ముగ్గురిలో ఎవరు కోట్ చేసుంటారో వారిని ఎంపికచేయనున్నట్టు టీటీడీ రెవెన్యూ వర్గాలు తెలిపాయి.

పకడ్బందీగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను పగడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కలెక్టరేట్ నుంచి ఆయన జూమ్ ద్వారా అధికారులతో సమావేశమయ్యారు. ఆదివారం నుంచి 26వ తేదీ వరకు తిరుపతిలో 10 క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 24న తారకరామా స్టేడియంలో ప్రారంభోత్సవం ఉంటుందని, వివిధ జోన్ల నుంచి క్రీడాకారులతోపాటు సుమారు 1,700మంది వస్తున్నారని, వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. క్రీడాకారులకు రవాణా, భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, చిత్తూరు, తిరుపతి స్పోర్ట్స్ అథారిటీ అధికారులు బాలాజీ, శశిధర్, డీటీసీ మురళీమోహన్, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీఈవో కుమార్, తహసీల్దార్లు పాల్గొన్నారు.